ప్రతిపక్షం

www.prathipaksham.in

శుక్రవారం 05.12.2025 | Published From Hyderabad | సంపుటి: 18 సంచిక: 255 పేజీలు:8 | ₹5

@prathipaksham | prathipaksham tv telugu

మూడో వన్డే కోసం..వైజాగ్ చేరుకున్న టీమిండియా 8

‘గ్లోబల్ సమ్మిట్’లో పెట్టుబడులు!

90కిపైగా దిగ్గజ కంపెనీలు సిద్ధం

ప్రభుత్వంతో ఒప్పందాలకు చాన్స్

- సదస్సులో అవకాశాల గురించి వివరణ
- పెట్టుబడుల ఆకర్షణే కీలకంగా ప్రణాళిక
- 2047 నాటికి త్రీ ట్రిలియన్ డాలర్ ఎకానమీ
- ప్రపంచస్థాయి ప్రమాణాలతో కంపెనీల ఏర్పాటు
- రూ.70 వేల కోట్లతో హైపర్ వాల్ట్ డేటా సెంటర్
- రూ.850 కోట్లతో అర్బన్ బీచ్ ఎంటర్‌టైన్‌మెంట్
- జహీరాబాద్‌లో హ్యుండాయ్ టెస్ట్ ట్రాక్ ఏర్పాటు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, డిసెంబర్ 4: రాష్ట్రంలో భారీగా పెట్టుబడులు పెట్టేందుకు పలు దిగ్గజ కంపెనీలు ఆసక్తి చూపుతున్నాయి. విద్య, నైపుణ్య, క్రీడా, పర్యాటక, పరిశ్రమ రంగాలలో ఈ ప్రభుత్వంతో సుమారు 90కి పైగా పరస్పర అవగాహన ఒప్పందాలు కుదుర్చుకునే అవకాశాలు ఉన్నాయి. ఈ నెల 8, 9 న జరగనున్న గ్లోబల్ సమ్మిట్ వేదికగా రూ. వేల కోట్ల పెట్టుబడులకు ఎంవోయూలు చేసుకునేందుకు కంపెనీలు సంసిద్ధత వ్యక్తం చేశాయి. పెట్టుబడుల ఆకర్షణను కీలకమైన అంశంగా ప్రభుత్వం పరిగణిస్తోంది. 2047 నాటికి త్రీ ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను సృష్టించేలా ప్రణాళికలు రచిస్తోంది. స్థిరమైన విధానాలు, ప్రపంచస్థాయి అత్యుత్తమ మౌలిక సదుపాయాలు, వ్యాపార సౌలభ్యం, బలోపేత ఆవిష్కరణ వ్యవస్థలు అన్నింటికి మించి మెరుగైన జీవన నాణ్యత, ఈ ఐదు అంశాలు ప్రపంచంలోనే అత్యుత్తమ పెట్టుబడుల గమ్యస్థానంగా

...:: మిగతా 2లో

ఏ ఆశయంతో సోనియాగాంధీ తెలంగాణ ఇచ్చారో గత పదేండ్లలో అది నెరవేరలేదని సీఎం వివర్శించారు. రాష్ట్ర అభివృద్ధికి ‘తెలంగాణ రైజింగ్-2047 డాక్యుమెంటరీ’ని రూపొందించామని, పెట్టుబడులు సాధించే లక్ష్యంతో ఈనెల 8, 9న గ్లోబల్ సమ్మిట్ నిర్వహిస్తున్నామని అన్నారు. సంక్షేమం, అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లాంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి నడవాలన్నారు. 16 లక్షల ఎకరాలకు నీళ్లు ఇవ్వడం కోసం రూ.38 వేల కోట్లతో నాటి సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి ‘ప్రాణహిత– చేవెళ్ల’కు శంకుస్థాపన చేశారని తెలిపారు. ఆదిలాబాద్ కు నీళ్లు ఇవ్వడం కోసం వందల కోట్లు ఖర్చు చేశారని, ఒక పెద్దాయన దయ్యంలా మారి ప్రాజెక్టును కాలగర్భంలో కలిపాడని మండిపడ్డారు.

మన ఊరు బాగుపడాలి

మంచివారు సర్పంచ్ కావాలి

- అలాంటి వారినే ఎన్నుకోండి
- ప్రభుత్వ వ్యతిరేకులను దూరం పెట్టండి
- వారితో ఎలాంటి మేలూ జరుగదు
- ఆదిలాబాద్'కు ఎయిర్ పోర్ట్, యూనివర్సిటీ
- ‘ప్రాణహిత-చేవెళ్ల’ ప్రాజెక్ట్ కట్టి తీరుతాం
- పర్యాటక కేంద్రంగా ఇంద్రవెల్లిని రూపుదిద్దుతాం
- ‘తెలంగాణ రైజింగ్2047’ మన రాష్ట్ర భవిష్యత్తు
- రోజుకు 20 గంటలు ప్రజల కోసం ఆలోచిస్తున్నా
- రెండేండ్లలో ఒక్కరోజు కూడా సెలవు తీసుకోలేదు
- 4 కోట్ల ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా పని చేస్తున్నాం
- ఆదిలాబాద్ బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి

ప్రతిపక్షం ఉత్తర తెలంగాణ బ్యూరో

ఆదిలాబాద్, డిసెంబర్ 4: గ్రామాలను అభివృద్ధి చేసే మంచి వ్యక్తులను సర్పంచులుగా ఎన్నుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. అభివృద్ధిని అడ్డుకునే వారిని ఎన్నుకోవద్దని సూచించారు. ప్రభుత్వ వ్యతిరేకులను ఎన్నుకున్నా ఉపయోగం ఉండదని అన్నారు. ప్రజా పాలన విజయోత్సవాలలో భాగంగా ఆయన ఆదిలాబాద్ పట్టణంలో పలు అభివృద్ధి పనులకు గురువారం శ్రీకారం చుట్టారు. అనంతరం బహిరంగ సభలో మాట్లాడారు. సర్పంచ్ అభ్యర్థులు కూడా డబ్బులు అనవసరంగా ఎక్కువ ఖర్చు చేయొద్దని పేర్కొన్నారు. ఆదిలాబాద్ అభివృద్ధి బాధ్యత తనదని చెప్పారు. విమానాశ్రయం ఇచ్చామని, త్వరలోనే యూనివర్సిటీ కూడా ఇస్తామని వెల్లడించారు. అది ఎక్కడ నిర్మించాలో ఇక్కడి నేతలంతా కలిసి ఓ నిర్ణయం తీసుకోవాలన్నారు. ఇంద్రవెల్లిలో అయితే బాగుంటుందని తన అభిప్రాయం అనీ, స్థలం ఎక్కడో నిర్ణయించాల్సిన బాధ్యత ఉమ్మడి ఆదిలాబాద్ నేతలదే అని సీఎం స్పష్టం చేశారు. తుమ్మిడిహెట్టి దగ్గర ప్రాజెక్ట్ కట్టి తీరుతామన్నారు. ఈ ప్రాంతంలో అపారమైన సున్నపు గనులు ఉన్నాయని, ఇక్కడ సిమెంట్ కంపెనీని మళ్లీ

...:: మిగతా 2లో

ఇండియా చేరుకున్న పుతిన్

భారత్‌లో రెండు రోజుల పర్యటన కోసం రష్యా అధ్యక్షుడు వ్లాదిమిన్ పుతిన్ ఢిల్లీకి చేరుకున్నారు. పాలం ఎయిర్‌పోర్ట్‌కు పుతిన్ విమానం చేరుకుంది. ప్రధాని నరేంద్ర మోదీ ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పుతిన్, మోదీ ఆత్మీయ ఆళింగనం చేసుకున్నారు.

7

హెచ్1బీ వీసా దరఖాస్తులకు కొత్త నిబంధన

అమెరికాలో ఉద్యోగం చేయడానికి హెచ్-1బీ వీసా కోసం దరఖాస్తు చేసుకొనే వారు ఇకపై తమ సామాజిక మాధ్యమాల ఖాతాలను బహిరంగపరచాలంటూ ట్రంప్ ప్రభుత్వం ఓ కొత్త నిబంధనను ప్రకటించింది.

7

24 నెలలు, 2,400 మంది

- ఆయుధాలతో ‘అన్న’ల లొంగుబాటు
- దంతేవాడలో జిల్లాలోనే 508 మంది
- తెలుగు రాష్టాలలోనూ ఆగని వేట
- రోజూ కొనసాగుతున్న ఎదురుకాల్పులు
- శాంతి-అభివృద్ధి వైపు పెద్ద అడుగన్న సర్కారు

ప్రతిపక్షం ఉత్తర తెలంగాణ బ్యూరో

కరీంనగర్, డిసెంబర్ 4: దండకారణ్యం దద్దరిల్లుతోంది. బీజాపూర్ దంత్యవాడ సమీపంలో ఎదురు కాల్పులు జరుగుతూనే ఉన్నాయి. ఇందులో 20 మంది మావోయిస్టులు మృతి చెందినట్లు తెలుస్తుంది. సంఖ్య పెరిగే అవకాశం ఉందని పోలీసువర్గాలు చెబుతున్నాయి. గురువారం ఉదయం ఐదుగురు మృతి చెందగా, బుధవారం రాత్రి ఎనిమిది గంటల సమయం వరకు 12 మంది మావోయిస్టులు మృతి చెందారని చెబుతున్నారు. భద్రతా దళాలు ఆయా ప్రాంతాలలో గాలింపు చర్యలు ముమ్మరం చేశాయి. ఈ ఎదురు కాల్పులలో ఇప్పటికే ముగ్గురు డీఆర్ జవాన్లు కూడా మృతి చెందారు. ఛత్తీస్‌గఢ్ తో పాటు తెలుగు రాష్టాలలో చూస్తే, గత 24 నెలలలోనే 2,400 మందికి పైగా మావోయిస్టులు చనిపోయారు. ఇది గత ఒక దశాబ్ద కాలంలో నమోదు కాని రికార్డు మార్పు అని భద్రతా శాఖ అంచనా వేస్తోంది. ముఖ్యంగా దంతేవాడ, బస్తార్, సూకమా వంటి మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలలో ఈ సమర్పణలు కొనసాగుతుండటం విశేషం. ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టు ఉద్యమం క్రమ క్రమంగా క్షీణిస్తున్నదన్న దానికి తాజా గణాంకాలు స్పష్టమైన ఉదాహరణ. గత 20 నెలలలో దంతేవాడ జిల్లాలో మొత్తం 508 మంది మావోయిస్టులు చనిపోయారని, అందులో 165 మంది బౌంటీ ఉన్న కీలక క్యాడర్ సభ్యులు ఉన్నారని పోలీస్ అధికారులు వెల్లడించారు. ఇదంతా చాలా వరకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పునర్వాసన కార్యక్రమాల ప్రభావమేనని అధికారులు చెబుతున్నారు.

స్వచ్ఛందంగా ఆయుధాలు వదిలి

దంతేవాడ జిల్లాలో గత ఆదివారం

...:: మిగతా 2లో

సీనియర్ జర్నలిస్ట్ హనీ ట్రాప్!!

బ్లాక్ మెయిల్ చేసి కోవర్టుగా మార్పు?

- సీఎంఓలో ఇంటి దొంగల హల్ చల్
- విజిలెన్స్ విచారణలో చేదు నిజాలు
- సీరియస్ గా తీసుకున్న సీఎం, సీఎస్
- ప్రభుత్వ వర్గాలలో తీవ్ర కలకలం

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, డిసెంబర్ 4 : తెలంగాణ ప్రభుత్వంలో అత్యంత కీలక నిర్ణయాలు ముందుగానే బీఆర్ఎస్ పార్టీకి చేరుతున్నాయి. చాలా రోజుల నుంచి ప్రభుత్వ పెద్దలకు ఈ అంశంపై అనుమానాలు ఉన్నా, హిల్ట్ పాలసీ గురించి పూర్తి స్థాయిలో కేబినెట్‌కు కూడా వివరాలు తెలియక ముందే బీఆర్ఎస్‌కు తెలిసిపోవడంతో కోవర్ట్ చాలా ఉన్నత స్థాయిలోనే ఉన్నారని క్లారిటీ వచ్చింది. ఈ అంశంపై విజిలెన్స్ దర్యాప్తు చేసిది. నివేదికను సిద్ధం చేసింది. ఆ నివేదికను సీఎం వద్ద

...:: మిగతా 2లో

సుష్మా స్వరాజ్ భర్త కన్నుమూత

సీనియర్ న్యాయవాది, మిజోరం మాజీ గవర్నర్, దివంగత సుష్మా స్వరాజ్ భర్త స్వరాజ్ కౌశల్ గురువారం కన్నుమూశారు. ఆయన వయస్సు 73 ఏళ్లు. పలువురు నేతలు ఆయన అంత్యక్రియల్లో పాల్గొని నివాళి అర్పించారు.

7

భారత్‌కు చేరిన రష్యా అధ్యక్షుడు

- వ్లాదిమిర్ పుతిన్ కు ఘనస్వాగతం
- నేడు ప్రధాని మోడీతో కీలక చర్చలు
- సైనిక బలగాలు, నౌకలు, విమానాలు
- వివిధ అంశాలపై కుదరనున్న ఒప్పందాలు

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో

న్యూఢిల్లీ, డిసెంబర్ 4 : అగ్రరాజ్యం అమెరికా సహా నాటో కూటమిలోని అన్ని దేశాలకు చుక్కలు చూపిస్తున్న రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ గురువారం భారత్ కు

...:: మిగతా 2లో

...:: 3లో

ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లనే

ప్రజలకు బాధలు

- మేడ్చల్–మల్కాజిగిరి జనం బాటలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలిస్తూ ప్రభుత్వం, అధికారులు, ప్రజా ప్రతినిధుల నిర్లక్ష్యంపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

టోల్ గేట్ల వద్ద ఆగనవసరం లేదు

హైవేలపై టోల్‌ను వసూలు చేసేందుకు అనుసరిస్తున్న ప్రస్తుత విధానం ఓ ఏడాదిలో ముగుస్తుందని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ చెప్పారు. దీని స్థానంలో ఎలక్ట్రానిక్ విధానం ఓ ఏడాదిలోగా అమల్లోకి వస్తుందన్నారు.

7

సీనియర్ జర్నలిస్ట్ హనీ ట్రాప్!!

మొదటిపేజీ తరువాయి

ఉంచారు. చీఫ్ సెక్రటరీ. హిల్ట్ పాలసీ గురించి ప్రభుత్వం చాలా అత్యున్నత స్థాయిలో కసరత్తు చేసింది. కేబినెట్ లో నిర్ణయం తీసుకోవాలనుకునేవరకూ మంత్రులకు కూడా తెలియదు. విధివిధానాలు అన్నీ కసరత్తు చేసి డ్రాఫ్ట్ గా నోట్ తయారు చేసుకున్నారు. ఆ దశలోనే బీఆర్ఎస్ వద్దకు సమాచారం చేరిపోయింది. ప్రభుత్వం ఇది ఎవరికీ తెలియదనుకుంటున్న సమయంలోనే హిల్ట్ పాలసీ గురించి కేటీఆర్ ప్రెస్ మీట్ పెట్టి ఐదు లక్షల కోట్ల స్కాం అని ఆరోపణలు చేశారు. దీంతో ఆశ్చర్యపోవడం ప్రభుత్వ పెద్దల వంతు అయింది. అనుకున్నంత తేలికగా రాజకీయం లేదని తమ వద్దనే బీఆర్ఎస్ కోవర్టులు ఉన్నారని గుర్తించారు. అసలు కోవర్ట్ ఎవరో కాంగ్రెస్ పెద్దలకు తెలిసిపోయిందని చెబుతున్నారు. 'ఆయనను సీఎం రేవంత్ రెడ్డి ఎంతో నమ్మారని చెబుతున్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో జర్నలిస్టుగా ఉన్న ఆయన సిన్సియారిటీని రేవంత్ నమ్మారు. కాంగ్రెస్ పార్టీకి కంచుకోట లాంటి జిల్లా నుంచి వచ్చిన ఆయనకు నామినేటెడ్ పదవిని చాలా ముందుగానే ప్రకటించారు. సీఎంతో నిత్యం సమావేశాలలో పాల్గొనేంత కీలక పదవి ఇచ్చారు. తర్వాత రాజ్యాంగ బద్ధ పదవి ఇచ్చారు. పదవి ఏదైనా తనకు ఉన్న చనువుతో కీలక విషయాలను తెలుసుకునేవారు. గుట్టుచప్పుడు కాకుండా బీఆర్ఎస్ పార్టీ పెద్దలకు పంపుతున్నారు. హిల్ట్ పాలసీ కి సంబంధించిన డాక్యుమెంట్లు కూడా ఇలా ఫార్వార్డ్ అయ్యాయి' అని ప్రభుత్వ సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి.

సాధారణంగా అధికారుల స్థాయిలో

సాధారణంగా అధికారుల స్థాయిలో సమాచారం లీక్ అవుతుంది. కానీ అధికారులు ఎలాంటి డాక్యుమెంట్లు ఫార్వార్డ్ చేయరు. అలాంటి రిస్క్ తీసుకోలేరు. నోటిమాటగా సమాచారం ఇవ్వగలరు. కానీ హిల్ట్ పాలసీ విషయంలో డాక్యుమెంట్లు కూడా బీఆర్ఎస్ ముఖ్యనేతలకు షేర్ అయ్యాయని విజిలెన్స్ గుర్తించింది. ఆయన ఎవరో కూడా వారు కనిపెట్టారు. ఆయన ఇలా బీఆర్ఎస్ పార్టీతో కుమ్మక్కయ్యారనడానికి కారణాలు ఉన్నాయని అంటున్నారు. డబ్బుతో పాటు హనీట్రాప్ బారిన పడ్డారని, చివరకు బ్లాక్ మెయిల్ కారణంగానే ఇలా కోవర్టుగా మారారని అంటున్నారు. ఇక ఈ విషయంలో సీఎం తీసుకునే నిర్ణయమే కీలకం కానుంది. ఇలాంటివి గతంలోనూ జరిగాయి కానీ, ప్రభుత్వం సీరియస్ గా తీసుకోలేపోయింది. అసలు ఎవరు సమాచారాన్ని లీక్ చేస్తున్నారో మాత్రం గుర్తించలేకపోయారు. ఫలితంగా చిక్కులలో పడాల్సి వస్తోంది. ఎలాంటి కారణం అయినా సరే, ఇలాంటి పరిస్థితి రావడం కాంగ్రెస్ ప్రభుత్వ వర్గాలను కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది.

రాజీవ్ గాంధీ సివిల్స్ అభయ హస్తం ద్వారా

ఎంతమందికైనా సాయం అందిస్తాం

- సీనియర్ అధికారులతో ఇంటర్వ్యూ బోర్డును ఏర్పాటు చేస్తాం
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు
- మెయిన్స్ కు ఎంపికైన 50 మందికి ఆర్థిక సాయం అందజేత

ప్రతిపక్షం, స్టేట్ బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్4: రాజీవ్ గాంధీ సివిల్స్ అభయ హస్తం పథకం కింద సివిల్ సర్వీసెస్ మెయిన్స్, ఇంటర్వ్యూ లకు ఎంతమంది ఎంపికైనా ఆర్థిక సహాయం అందిస్తాం అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. గురువారం సాయంత్రం ఆయన ప్రజా భవన్ లో రాజీవ్ గాంధీ సివిల్స్ అభయహస్తం పథకం ద్వారా యూపీఎస్సీ ఇంటర్వ్యూకు ఎంపికైన 50 మంది అభ్యర్థులకు సింగరేణి ఆధ్వర్యంలో ప్రభుత్వం తరఫున మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిభకు ఆర్థిక ఇబ్బందులు అడ్డురాకూడదనే సంకల్పంతో మెయిన్స్‌కు ఎంపికైన వారికి లక్ష రూపాయలు, ఇంటర్వ్యూకు అర్హత సాధించిన వారికి అదనంగా మరో లక్ష రూపాయల ఆర్థిక సాయం, అలాగే ఢిల్లీలో వసతి సౌకర్యం కల్పిస్తున్నామని అన్నారు. గతేడాది 20 మంది ఎంపిక కాగా, ఈసారి 50 మంది అర్హత సాధించడం ప్రశంసనీయమని, రాబోయే సంవత్సరాల్లో ఈ సంఖ్య ఎంత పెరిగినా ఎంతమందికైనా ఆర్థిక సాయం అందించడం జరుగుతుంది. సీనియర్ అధికారులతో ఇంటర్వ్యూ బోర్డు ఏర్పాటు చేయాలని ఇప్పటికే చీఫ్ సెక్రటరీతో చర్చలు జరిపామని అన్నారు. సివిల్స్ ఇంటర్వ్యూలకు ఎంపికైన అభ్యర్థులకు రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని అభినందనలు తెలియజేశారు. ముందుగా సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ మాట్లాడుతూ పేద వర్గాల నుంచి కూడా అభ్యర్థులు సివిల్స్ పరీక్షల్లో విజేతలుగా నిలవాలి అనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన సివిల్స్ అభయహస్తం పథకానికి సింగరేణి సంస్థ తన సామాజిక బాధ్యత కార్యక్రమంలో భాగంగా సంపూర్ణ సహకారం అందిస్తుందని పేర్కొన్నారు. మొదటి ఏడాది మంచి స్పందన లభించిందని, రెండో ఏడాది రెట్టింపు స్పందనతో పాటు ఎక్కువ సంఖ్యలో అభ్యర్థులు ఫైనల్స్ కు ఎంపికవడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు సంస్థ డైరెక్టర్ పర్సనల్ గౌతమ్ పొట్రు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కోల్ మూమెంట్ బి. వెంకన్న ఫైనల్ ఇంటర్వ్యూలకు ఏ విధంగా సంసిద్ధం కావాలి అనే అంశంపై సూచనలు చేశారు. అభ్యర్థుల సందేహాలను నివృత్తి చేశారు. ఇదే కార్యక్రమంలో తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించేలా రూపొందించిన సింగరేణి బ్రాండ్ శాలువాను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు ఆవిష్కరించారు. అలాగే సింగరేణి జ్ఞాపికను ఆయన ఆవిష్కరించారు. ఇకపై సింగరేణి అధికారిక కార్యక్రమాల్లో వీటిని ఉపయోగిస్తామని, తెలంగాణ రైజింగ్ కార్యక్రమాల సందర్భంగా సింగరేణి అభివృద్ధి, తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించాలన్న ఉద్దేశంతోనే వీటిని రూపొందించినట్లు సీఎండీ ఎన్.బలరామ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజర్ కోఆర్డినేషన్, మార్కెటింగ్ తాడబోయిన శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేటి తరానికి స్ఫూర్తి రోశయ్య

- మంత్రి పొన్నం ప్రభాకర్
- రవీంద్ర భారతిలో 4వ వర్ధంతి సభ

ప్రతిపక్షం, స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్4: ఆంధ్ర ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య 4వ వర్ధంతి సభ గురువారం రవీంద్ర భారతిలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రి పొన్నం ప్రభాకర్ తదితరులు మాజీ ముఖ్యమంత్రి రోశయ్య చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి, మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య ఆజానుబాహులని, ఆయన మాటల్లోనూ, వ్యక్తిత్వంలో ఆచరణలో ఈనాటి తరానికి స్ఫూర్తి అని అన్నారు. వారిని ఆదర్శంగా తీసుకొని ఏ విధంగా ఓపికగా ఉండాలి, కింది స్థాయి నుండి రాజకీయాల్లోకి వచ్చి ఎలా ఎదగవచ్చు అని నేర్చుకోవచ్చన్నారు. రోశయ్య జీవిత చరిత్ర నుండి ఆర్థిక క్రమశిక్షణ నేర్చుకోవాలి. ఈ సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నేత వి. హనుమంతరావును సత్కరించారు. రోశయ్య మెమోరియల్ ట్రస్ట్ రోశయ్య మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎంపిక చేసిన పేద విద్యార్థులకు స్కాలర్ షిప్లను అందించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దయానంద్, జగ్గారెడ్డి , మాజీ మంత్రి వెన్నెంపల్లి శ్రీనివాస్, ఆమంచి కృష్ణ మోహన్, వైశ్య కార్పొరేషన్ చైర్మన్ కాల్వ సుజాత , టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఉప్పల్ శ్రీనివాస్ గుప్తా, ఇతర ముఖ్య నేతలు పాల్గొన్నారు.

మన ఊరు బాగుపడాలి

మొదటిపేజీ తరువాయి

ప్రారంభిస్తామని అన్నారు. అత్యంత వెనకబడిన ఆదిలాబాదును అభివృద్ధి చేసే బాధ్యత తీసుకుంటానని భరోసా ఇచ్చారు. ఇక్కడ ఎయిర్‌పోర్టు వస్తే పరిశ్రమలు వస్తాయని పేర్కొన్నారు. ఎర్రబస్సే కాదు, ఆదిలాబాద్‌కు ఎయిర్ బస్సు కూడా తీసుకువస్తామని చెప్పారు.

త్వరలోనే మళ్లీ ఆదిలాబాద్‌కు వస్తా

ఇంద్రవెల్లిని పర్యాటక కేంద్రంగా మారుస్తున్నామని సీఎం పేర్కొన్నారు. త్వరలోనే మళ్లీ ఆదిలాబాద్‌కు వస్తానని, రోజంతా సమస్యలపై సమీక్షిస్తానని తెలిపారు. ఎడ్యుకేషన్, ఇరిగేషన్, కమ్యూనికేషన్‌లో ఆదిలాబాద్ అభివృద్ధి చెందుతోందని వివరించారు. ఆదిలాబాద్‌లో తప్పకుండా యూనివర్సిటీ ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. యేడాదిలో 60 వేల ఉద్యోగాలు ఇచ్చామని అన్నారు. రాబోయే రోజులలో మరో 40 వేల ఉద్యోగాలు ఇస్తామన్నారు. పట్టణంలో రూ.18.7 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు సీఎం రేవంత్ శంకుస్థాపన చేశారు. రెండు సంవత్సరాల క్రితం ఓటును ఆయుధంగా మార్చి నిరంకుశ ప్రభుత్వాన్ని సాగనంపారని అన్నారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా భావిస్తూ ముందుకెళ్తున్నామని తెలిపారు. గత రెండేళ్లుగా ఒక్క రోజూ సెలవు తీసుకోకుండా పని చేస్తున్నానని తెలిపారు. యేడాది తిరిగేలోపు ఆదిలాబాద్‌లో విమానాశ్రయం నిర్మాణ పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు ప్రజలు తెచ్చుకున్న ప్రజాప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకుంటోందని గుర్తు చేశారు. సంక్షేమం అభివృద్ధి రెండు కండ్లుగా భావిస్తూ ముందుకెళ్తున్నామని అన్నారు. చిన్న వయసులోనే తనకు గొప్ప అవకాశం దక్కడం ప్రజల దీవెన, దేవుడి సంకల్పమన్నారు. వెనకబడిన ప్రాంతాల అభివృద్ధికి రాజకీయాలకు అతీతంగా కృషి చేస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వం విపక్ష ఎమ్మెల్యేలను ప్రభుత్వ కార్యక్రమాలకు కూడా అనుమతించలేదని, ఎమ్మెల్యేలను కూడా అటు సచివాలయంలోకి రాకుండా అడ్డుకున్న ప్రభుత్వాన్ని గత పదేండ్లలో చూశామని ఆరోపించారు.

గత ప్రభుత్వంపై పోరాటం

ఏ ఆశయంతో సోనియాగాంధీ తెలంగాణ ఇచ్చారో గత పదేండ్లలో అది నెరవేరలేదని సీఎం విమర్శించారు. రాష్ట్ర అభివృద్ధికి 'తెలంగాణ రైజింగ్ 2047 డాక్యుమెంటరీ'ని రూపొందించామని, పెట్టుబడులు సాధించే లక్ష్యంతో ఈనెల 8, 9న గ్లోబల్ సమ్మిట్ నిర్వహిస్తున్నామని అన్నారు. సంక్షేమం, అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లాంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి నడవాలన్నారు. 16 లక్షల ఎకరాలకు నీళ్లు ఇవ్వడం కోసం రూ.38 వేల కోట్లతో నాటి సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి 'ప్రాణహిత - చేవెళ్ల'కు శంకుస్థాపన చేశారని తెలిపారు. ఆదిలాబాద్ కు నీళ్లు ఇవ్వడం కోసం వందల కోట్లు ఖర్చు చేశారని, ఒక పెద్దాయన దయ్యంలా మారి ప్రాజెక్టును కాలగర్భంలో కలిపాడని మండిపడ్డారు. ఆయన ఇంట్లో కనుక వర్షం కురిసింది తప్ప ఆదిలాబాద్ కు నీళ్లు రాలేదని విమర్శించారు. తమ్మిడి హట్టి దగ్గర 150 మీటర్ల కు అనుమతి ఇవ్వడానికి మహారాష్ట్ర ఒప్పుకున్నా గత ప్రభుత్వ తీరుతో కిందకు ప్రాజెక్టు తరలిపోయిందని ఆరోపించారు. రూ. లక్ష కోట్లు గోదావరిలో కొట్టుకపోయాయని విమర్శించారు. ఈ సమావేశంలో మంత్రులు గడ్డం వివేక్ వెంకటస్వామి, జూపల్లి కృష్ణా రావు, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

భారత్‌కు చేరిన రష్యా అధ్యక్షుడు

మొదటిపేజీ తరువాయి

చేరుకున్నారు. భారతదేశానికి చిరకాల మిత్రదేశంగా ఉన్న రష్యా దశాబ్దాలుగా భారత్‌కు ఆయుధాలు, రక్షణ పరికరాలను అందించడమే కాదు, సాంకేతిక పరిజ్ఞానాన్ని కూడా అందజేస్తూ వచ్చింది. అనునిత్యం ఆ దేశంతో భారత్ ఎన్నో రంగాలలో ఒప్పందాలు చేసుకుంటోంది. పుతిన్ తాజా పర్యటనతో ఏయే రంగాలలో ఎలాంటి ఒప్పందాలు, జరుగుతాయన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. రెండు దేశాల మధ్య విస్తృత ద్వైపాక్షిక అంశాలపై సమగ్ర చర్చలు జరగనున్నాయి. ఇద్దరు నాయకులు సెప్టెంబర్ ఒకటిన చైనాలోని తియాంజిన్‌లో జరిగిన ఎస్సీఓ శిఖరాగ్ర సమావేశంలో సమావేశమయ్యారు. ఆ తర్వాత కూడా ఐదు పర్యాయాలు టెలిఫోన్‌లో మాట్లాడుకున్నారు. మాస్కోలో రష్యా అధ్యక్షుడు, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ధోవల్, రెండుసార్లు విదేశాంగ మంత్రి డా. ఎస్. జైశంకర్‌ను కలుసుకున్నారు. ఎస్400 మిస్సైల్ సిస్టమ్ అదనపు డెలివరీలు, స్యూ57 స్టెల్త్ ఫైటర్ జెట్ ల కొనుగోలు, ఎస్500 అడ్వాన్స్‌డ్ ఎయిర్ డిఫెన్స్ షీల్డ్ వంటి అంశాలు చర్చనీయాంశాలలో ఉన్నాయి.

'గ్లోబల్ సమ్మిట్'లో పెట్టుబడులు!

మొదటిపేజీ తరువాయి

మన తెలంగాణను మార్చాయనే విషయాన్ని సదస్సులో సర్కార్ ప్రస్తావించనుంది. రాష్ట్రంలో భారీగా పెట్టుబడులకు ఇప్పటికే 50 కంపెనీలు సంసిద్ధత తెలిపాయి.

ఇంటిగ్రేటెడ్ గ్లోబల్ కన్వెన్షన్

ఫ్యూచర్ సిటీలో రూ. మూడు వేల కోట్లతో మూడు హోటళ్లతో కూడిన ఇంటిగ్రేటెడ్ గ్లోబల్ కన్వెన్షన్‌ను నిర్మించనున్న ఫుడ్ లింక్ ఎఫ్అండ్‌బీ హోల్డింగ్ ఇండియా ప్రయివేట్ లిమిటెడ్‌తో ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకోనుంది. వంతారా రిలయన్స్ గ్రూప్‌తో వన్యప్రాణి సంరక్షణ కేంద్రం, నైట్ సఫారీ మీద ఒప్పందం కుదుర్చుకోనున్నారు. అజయ్ దేవగన్‌తో ఫిల్మ్ సిటీ ఏర్పాటుపై ఒప్పందం, ఐఐఎఫ్ఏతో ఫిల్మ్ ఇన్ తెలంగాణ కార్యక్రమంలో భాగస్వామ్యం, టోనీ బ్లెయిర్ ఇన్‌స్టిట్యూట్‌తో పర్యాటక శాఖ పీఎంయూ స్థాపన ఒప్పందం చేసుకోనుంది. బౌద్ధ పర్యాటక సర్క్యూట్ ప్రోత్సాహంపై ఏసియన్ రాయబారులతో, కొత్వాల్ గూడలో ఆర్టిఫిషియల్ బీచ్ గురించి స్పెయిన్‌కు చెందిన పూయిడ్రాతో ఒప్పందం చేసుకోనున్నారు. రూ.850 కోట్లతో అర్బన్ బీచ్‌తో కూడిన ఎంటర్‌టైన్‌మెంట్ హబ్ కోసం యూఎస్‌ఏకు చెందిన క్రిస్టల్ లగూన్స్ అండ్ గ్రీన్ పాంథర్స్ ప్రాపర్టీస్ లిమిటెడ్‌తో ఎంఓయూ కుదుర్చుకోనుంది. రూ.70 వేల కోట్లతో హైపర్ వాల్ట్ డేటా సెంటర్ల ఏర్పాటుపై టీసీఎస్ టీపీజీతో ఒప్పందం చేసుకోనుంది. రూ.850 కోట్లతో ఏఐ కార్యక్రమాలు, డేటా సెంటర్లకు అక్విలోన్ నెక్సస్ లిమిటెడ్ అండ్ నార్త్‌స్టార్ ఆపర్చునిటీస్ ఫండ్‌తో అవగాహన కుదుర్చుకోనున్నారు. మైక్రోసాఫ్ట్ డేటా సెంటర్ విస్తరణకు చందన్‌పల్లిలో భూమి కేటాయించనున్నారు. రూ. ఎనిమిది వేల కోట్లతో జహీరాబాద్‌లో హ్యుండాయ్ టెస్ట్ ట్రాక్, తయారీ ప్లాంట్ తో పాటు రూ.400 కోట్లతో ప్లాంట్ల విస్తరణ మహీంద్రా అండ్ మహీంద్రాతో ఒప్పందం చేసుకోనున్నారు. ఫాక్స్‌కాన్‌తో ఫిట్ పేజీ2 విస్తరణ ఒప్పందం చేసుకోనున్నారు. రూ.1500 కోట్లతో ఎంఎస్ఎన్, రూ.200 కోట్లతో బయోలాజికల్ ఈతో పరిశోధన అభివృద్ధి హబ్‌ల ఏర్పాటుకు ఎంఓయూ కుదుర్చుకోనుంది. లులుహైపర్‌తో విమానాశ్రయానికి సమీపంలో లులు హైపర్ మాల్ ఏర్పాటుకు ఒప్పందం కుదుర్చుకోనున్నారు.

24 నెలలు, 2,400 మంది

మొదటిపేజీ తరువాయి

37 మంది మావోయిస్టులు స్వచ్ఛందంగా ఆయుధాలు వదిలి పోలీసుల ముందు లొంగిపోయారు. వీరిలో 12 మంది మహిళలు ఉన్నారు. 27 మంది మీద రూ 65 లక్షలుగా రివార్డ్ ఉంది. ముఖ్యమైన కమాండర్లు, ఏరియా, కంపెనీ సభ్యులు, మిలిషియా కమాండర్లు, ఫ్రంట్ఆర్గనైజేషన్ కార్యకర్తలు వీరిలో ఉన్నట్లు అధికారులు తెలిపారు. లొంగిపోయిన ప్రతి ఒక్కరికి తక్షణం రూ 50 వేల పరిహారం, ఉద్యోగ భద్రత, వ్యవసాయ భూమి వంటి ఆదాయ మార్గాలు కల్పిస్తున్నారు. మల్లోజుల వేణుగోపాల్ అలియాస్ అభయ్ తోపాటు 60 మంది మావోలు లొంగిపోయిన ఘటన మరిచి పోక ముందే. భారీ సంఖ్యలో మావోయిస్టులు లొంగిపోయారు. కేంద్ర కమిటి సభ్యుడు అశన్నతో సహా 208 మంది మావోయిస్టులు ఇందులో ఉన్నారు. ఇది నక్సల్ వ్యతిరేక పోరాటంలో పెద్ద విజమని, ఈ పరిణామం దేశంలో శాంతి, సమృద్ధికి దోహదం చేస్తుందని కే కేంద్ర హోమ్ శాఖ మంత్రి అమిత్ షా అప్పట్లో ప్రకటించడం సంచలనం సృష్టించింది. ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సమక్షంలో మావోయిస్టులు ఆయుధాలు అప్పగించారు. ఆశన్నతో పాటు లొంగిపోయిన 208 మంది మావోయిస్టులు లొంగిపోయారు. లొంగిపోయిన వారిలో పలువురు కీలక నాయకులు, డివిజన్ స్థాయి కమాండర్లు ఉన్నారు.

కలప వ్యాపారులే హిడ్మా 'ను పట్టించారు

హిడ్మాది పూర్తిగా భూటకపు ఎన్కౌంటర్ అని మావోయిస్టు పార్టీ ఆరోపించింది. దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ ప్రతినిధి వికల్ప్ పేరుతో లేఖ విడుదలైంది. 'హిడ్మాతో పాటు శంకర్ ను పట్టుకుని చిత్ర హింసలు పెట్టి చంపేశారు. ఏపీకి చెందిన కొందరు కలప వ్యాపారుల ద్రోహం వల్లనే వీళ్లు దొరికిపోయారు. అనారోగ్యంతో ఉన్న హిడ్మా, శంకర్ చికిత్స కోసం విజయవాడకు వెళ్లారు.. కలప వ్యాపారులతో కలిసి విజయవాడకు వెళితే పట్టుకున్నారు. వారం రోజులపాటు చిత్రహింసలకు గురిచేసిన ఆంధ్ర పోలీసులు వారిని చంపేశారు. ఈ ఎన్కౌంటర్ పై సమగ్ర దర్యాప్తు చేయాలి' అని లేఖలో డిమాండ్ చేశారు. కాగా, కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర పోలీసులు, సీఆర్పీఎఫ్ సంయుక్తంగా చేపట్టిన నక్సల్ నిర్మూలన చర్యలు ఫలితమివ్వడం ప్రారంభించాయని భద్రతావర్గాల అభిప్రాయం. లొంగిపోయిన మావోయిస్టులకు పునరావాసం, జీవనోపాధి అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఈ పరిణామంతో, దశాబ్దాలుగా కొనసాగుతున్న రెడ్ కారిడార్ ప్రాంతంలో మావోయిస్టు ఉద్యమం మరింతగా బలహీనపడిరదని నిపుణులు భావిస్తున్నారు.

'క్వాంటం సిటీ'గా హైదరాబాద్

- దేశంలోనే తొలిసారిగా 'లాంగ్ టర్మ్ క్వాంటం స్ట్రాటజీ'
- స్టార్టప్స్, ఇన్నోవేషన్స్ కోసం ప్రత్యేకంగా "ఫండ్స్ ఆఫ్ ఫండ్స్"
- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడి



ప్రతిపక్షం, స్టేట్ బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్4: "క్వాంటం సిటీ"గా హైదరాబాద్ ను తీర్చిదిద్దేలా తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. "క్వాంటం టెక్నాలజీ"లో తెలంగాణను గ్లోబల్ లీడర్ గా మార్చేలా నిపుణులు, పరిశ్రమల భాగస్వామ్యంతో దేశంలోనే తొలిసారిగా "లాంగ్ టర్మ్ క్వాంటం స్ట్రాటజీ"ని రూపొందించామన్నారు. గచ్చిబౌలిలోని "ఐఐటీ హైదరాబాద్"లో "నీతి ఆయోగ్ రోడ్ మ్యాప్ ఫర్ క్వాంటం & తెలంగాణ క్వాంటం స్ట్రాటజీ"ని గురువారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... అప్పట్లో విద్యుత్, ఇంటర్నెట్ లాంటి ఆవిష్కరణలు ప్రపంచం రూపురేఖలు మార్చాయన్నారు. అదే తరహాలో రాబోయే రోజుల్లో క్వాంటం టెక్నాలజీ కూడా అనేక మార్పులకు శ్రీకారం చుట్టబోతుందన్నారు. ఏఐ, క్వాంటం టెక్నాలజీ తదితర కటింగ్ ఎడ్జ్ టెక్నాలజీస్ లో తెలంగాణను గ్లోబల్ లీడర్ గా మార్చేలా పకడ్బందీ ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నామన్నారు. "లాంగ్ టర్మ్ క్వాంటం స్ట్రాటజీ"లో భాగంగా రీసెర్చ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, సైబర్ సెక్యూరిటీ, లైఫ్ సైన్సెస్ యాక్సిలరేషన్, టాలెంట్ పైప్‌లైన్ తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. క్వాంటం సెన్సింగ్, సెక్యూరిటీ, కమ్యూనికేషన్, క్వాంటం కంప్యూటింగ్ లో ఆర్అండ్ డీ, ఇన్నోవేషన్స్ ను ప్రోత్సహించేలా రూపొందించిన ఈ పాలసీ దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఒక రోల్ మోడల్ గా నిలుస్తుందన్నారు. ఈ టెక్నాలజీలో దేశానికి ఒక బెంచ్ మార్క్ సెట్ చేసేలా ప్రత్యేకంగా "సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్"కు కూడా శ్రీకారం చుట్టామన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి స్టార్టప్స్, కొత్త ఆలోచనలకు భరోసానిచ్చేలా "ఫండ్స్ ఆఫ్ ఫండ్స్"ను ప్రారంభించబోతున్నట్లు చెప్పారు. "ఇండస్ట్రీ డే" పేరిట ప్రతి వారంలో ఒకరోజు అధికారులు, ప్రతి నెలలో ఒక రోజు సంబంధిత మంత్రి పారిశ్రామికవేత్తలతో ప్రత్యేకంగా సమావేశమవుతారన్నారు. పరిశ్రమలు ఎదుర్కొంటున్న సవాళ్లు, పరిష్కార మార్గాలు, రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధికి ప్రభుత్వం అనుసరించాల్సిన వ్యూహాలపై సలహాలు, సూచనలు స్వీకరిస్తారన్నారు.

క్వాంటం ఎకానమీ లీడర్ గా హైదరాబాద్ : డిప్యూటీ సీఎం భట్టి

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ భవిష్యత్తు క్వాంటం ఎకానమీ లీడర్ గా హైదరాబాద్ నిలుస్తుంది, ఇందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు, డిజిటల్ నైపుణ్యం వంటి అన్ని వనరులు హైదరాబాదులో దండిగా ఉన్నాయని అన్నారు. నీతి ఆయోగ్ రోడ్డు మ్యాప్ "తెలంగాణ రైజింగ్ 2047", 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చే రాష్ట్ర దృష్టికోణానికి అనుగుణంగా రూపొందించబడింది అని అభివర్ణించారు. తెలంగాణ క్వాంటం వ్యూహం ద్వారా క్వాంటం టెక్నాలజీకి ప్రత్యేక రోడ్‌మ్యాప్ కలిగిన దేశంలోని తొలి రాష్ట్రంగా తెలంగాణ నిలుస్తుందనీ డిప్యూటీ సీఎం తెలిపారు. క్వాంటం టెక్నాలజీ ప్రపంచాన్ని ఏ ఇతర సాంకేతికత కంటే వేగంగా అన్ని రంగాల్లోనూ మార్పు తీసుకురాబోతుందని డిప్యూటీ సీఎం తెలిపారు. ఈ సమావేశంలో నీతి ఆయోగ్ సీఈవో బీవీఆర్. సుబ్రహ్మణ్యం, సభ్యులు డా. వీకే. సారస్వత్, దేబ్జాని ఘోష్, స్పెషల్ సీఎస్ సంజయ్ కుమార్, డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణభాస్కర్, ఐఐఐటిహైదరాబాద్, ఐఐటీహైదరాబాద్, సీఆర్ రావు ఇన్‌స్టిట్యూట్, టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ ప్రముఖులు పాల్గొన్నారు.

"



అమరావతిలో నిర్మించే ప్రతి భవనం విలక్షణంగా ఉండాలి. పచ్చదనంతో ప్రస్ఫుటంగా కనిపించేలా ఉండాలి. మౌలిక సదుపాయాల కోసం నాబార్డు రూ.7,380 కోట్ల రుణానికి ఆమోదం తెలిపింది. నాణ్యతలో రాజీపడకుండా గడువుకన్నా ముందే నిర్మాణాలు పూర్తిచేయాలి. తెలుగు ఆత్మగౌరవానికి, వైభవానికి ప్రతీకగా నీరుకొండ వద్ద ఎన్టీఆర్ విగ్రహం నిర్మించాలి.
- సీఆర్డీఏ భేటీలో ఏపీ సీఎం చంద్రబాబు

ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లనే ప్రజలకు బాధలు

- ప్రజా సమస్యలపై ప్రభుత్వంపై కవిత ఆగ్రహం
- మేడ్చల్–మల్కాజిగిరి జనం బాటలో
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్ 4: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలిస్తూ ప్రభుత్వం, అధికారులు, ప్రజా ప్రతినిధుల నిర్లక్ష్యంపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రామంతాపూర్ రథయాత్ర దుర్ఘటన బాధిత కుటుంబాల పరామర్శ నుంచి ఉప్పల్ ఫ్లైఓవర్ ఆలస్యంపై విమర్శలు, భగాయత్ ఎస్టీపీ నిర్మాణంపై మహిళల అరెస్టులను ఖండించడం వరకు, ప్రతి సమస్యపై తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లాలో జనం బాట కార్యక్రమంలో భాగంగా పలు ప్రాంతాలను పర్యటిస్తూ ప్రజల సమస్యలను పరిశీలించారు. రామంతాపూర్‌లో శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా రథయాత్రలో విద్యుత్ షాక్‌తో మృతి చెందిన ఐదుగురు యువకుల కుటుంబాలను ఆమె పరామర్శించారు. కరెంట్ తీగలు కిందకు వేలాడుతూ ఉండటమే ప్రమాదానికి కారణమని, ఇది ప్రభుత్వం మరియు విద్యుత్ శాఖ నిర్లక్ష్యమైన పనితీరునకు నిదర్శనమని కవిత మండిపడ్డారు. మృతుల కుటుంబాలకు తక్షణమే ఎక్స్‌గ్రేషియా ప్రకటించడంతో పాటు, ప్రతి కుటుంబ సభ్యునికి ఔట్‌సోర్సింగ్ లేదా కాంట్రాక్ట్ ఆధారంగా విద్యుత్ శాఖలో ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. నలభై నెలలు గడిచినా ప్రభుత్వం పట్టించుకోకపోవడం విచారకరమని, కలెక్టర్ వ్యక్తిగత శ్రద్ధతో పరిహారం అందించాలన్నారు. యాదవ సమాజానికి చెందిన వారు సహా వివిధ వర్గాల ప్రజలు ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారని, బాధిత కుటుంబాలకు జాగృతి తరఫున సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. ఉప్పల్‌లో ఫ్లైఓవర్ నిర్మాణ పనులను పరిశీలించిన కవిత, పద్నాలుగు ఏళ్లుగా ఈ పనులు సాగుతూనే ఉండటం, ప్రభుత్వాలు మారినా ప్రజల పరిస్థితి మాత్రం మారకపోవడం పై అసంతృప్తి వ్యక్తం చేశారు. శాసన మండలిలో ప్రశ్నించిన తర్వాత మంత్రి సమీక్ష చేసి పనులు పూర్తి చేస్తామని చెప్పినా మార్పు ఏమీ కనిపించలేదని తెలిపారు. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం లేకపోవడమే ఈ ఆలస్యానికి అసలు కారణమని ఆమె విమర్శించారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ఎంపీ ఈటల రాజేందర్ దృష్టి సారించాలని కోరారు. ప్రభుత్వం స్పందించకపోతే జాగృతి స్వయంగా ఒత్తిడి తెస్తుందని స్పష్టం చేశారు. తదుపరి ఉప్పల్ భగాయత్ వద్ద నిర్మిస్తున్న సెవేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్‌ను సందర్శించిన కవిత, వేరే ప్రాంతానికి మంజూరైన ఎస్టీపీని అకస్మాత్తుగా ఇక్కడికి తరలించడం ప్రజలపై అన్యాయమని అన్నారు. పార్క్, ఓపెన్ జిమ్, కమ్యూనిటీ హాల్ వంటి ప్రజలకు మేలు చేసే సదుపాయాలు ఉండాల్సిన స్థలంలో ఎస్టీపీని కట్టడం, కాలనీ వాసుల ఆరోగ్యానికి హానికరం అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై డీజీపీ దర్యాప్తు జరపాలని, ఎస్టీపీ పనులను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. అవసరమైతే కోర్టు ద్వారానే ప్రజలకు న్యాయం చేస్తామని తెలిపారు. మౌలాలిలో మహిళలతో సమావేశమైన కవిత, తెలంగాణ రాష్ట్ర నిర్మాణంపై ప్రజల ఆకాంక్షలు ఎంత ఉన్నా ప్రభుత్వాల మార్పు వల్ల వారి పరిస్థితిలో పెద్దగా మార్పు రాలేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పెన్షన్, రేషన్ కార్డుల విషయంలో ఇచ్చిన హామీలు నిలబెట్టుకోలేదని విమర్శించారు. మల్కాజిగిరిలో బండ చెరువును పరిశీలించిన కవిత, చెరువు కబ్జాలు పెరగడంతో దాని పరిమాణం తగ్గిపోవడం, గుర్రపు డెక్క పెరిగి దోమల సమస్య పెరగడం వల్ల ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. చెరువును రక్షించేందుకు ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

తెలంగాణ ప్రత్యేక నృత్యం 'కాకతీయం'

- గ్లోబల్ సమ్మిట్ లో నృత్యానికి భాగస్వామ్యం
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్4: భారత దేశంలోని ఒక్కో రాష్ట్రానికి ఒక్కో నృత్య శైలి ఉంది, అదే విధంగా తెలంగాణ రాష్ట్రానికి సంబంధించి కాకతీయం ప్రత్యేకమైనదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. గురువారం సాయంత్రం రవీంద్రభారతిలో పద్మశ్రీ పద్మజా రెడ్డితో పాటు వారి శిష్య బృందం ఏర్పాటు చేసిన నృత్య కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై డిప్యూటీ సీఎం ప్రసంగించారు. కాకతీయానికి సంబంధించి లోతుగా అధ్యయనం చేసి పుస్తక రూపంలో తీసుకురావడమే కాదు నృత్య రూపకంగా తీసుకొచ్చి తెలంగాణ రాష్ట్రానికి ప్రపంచంలోనే ప్రత్యేకతను తీసుకువచ్చిన పద్మశ్రీ పద్మజా రెడ్డిని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నట్టు డిప్యూటీ సీఎం తెలిపారు. అన్ని నాటకాల్లో సాంత్వన ఉంటుంది కానీ కాకతీయలో పేరిణి నృత్యం యుద్ధానికి వెళ్లే ముందు సైనికులను ఉత్తేజితులను చేసి వారిలో శక్తిని పోగేసి యుద్ధానికి సిద్ధం చేసే సందర్భం ప్రస్ఫుటంగా నృత్య రూపంలో చూపిస్తున్న పద్మజా రెడ్డి బృందానికి రాష్ట్ర ప్రభుత్వం పక్షాన అభినందనలు అన్నారు. పద్మజా రెడ్డి శిష్యులు ఖాళీయ మర్దనం నృత్య రూపకంలో సర్పాల నృత్యం కళ్లకు కట్టినట్టు చూపించారని వారికి ఉజ్వల భవిష్యత్తు ఉందని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని యావత్ కేబినెట్ డిసెంబర్ 7తో రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా గతంలో చేసిన పనులను చెప్పుకోవడంతోపాటు అభివృద్ధి చెందిన దేశాలతో పోటీపడేలా విజన్ డాక్యుమెంటును ఆవిష్కరిస్తున్నామని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర భవిష్యత్తు ఎలా ఉండబోతుంది అనేది ఈ డాక్యుమెంట్లో వివరించబోతున్నట్లు తెలిపారు. 2047 కల్లా మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీకి కావలసిన ప్రణాళికను ఈనెల 8, 9 తేదీల్లో ఆవిష్కరిస్తున్నామని వివరించారు. ఇన్ఫ్రా, ఇండస్ట్రీ, టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటం టెక్నాలజీ అన్ని అంశాలను విజయం డాక్యుమెంట్లో వివరించనున్నట్లు తెలిపారు. గ్లోబల్ సమ్మిట్ కు ప్రపంచంలో ప్రసిద్ధి చెందిన వ్యక్తులతో పాటు ప్రఖ్యాత సంస్థల సీఈఓలను ఆహ్వానిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాకతీయ నృత్యాన్ని ఏర్పాటు చేసే ఆలోచన చేస్తున్నామని ఈ నృత్యాన్ని భాగస్వామి గా చేసే ఆలోచన ను కమిటీ పర్యవేక్షిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి పల్లంరాజు, ఢిల్లీలో ప్రభుత్వ ప్రతినిధి జితేందర్ రెడ్డి, పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ బుర్ర వెంకటేశం, ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి యోగితా రానా తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టు దామోదర్ మృతదేహానికి కేటీఆర్ నివాళి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్ 4: గాంధీ హాస్పిటల్లో సీనియర్ వీడియో జర్నలిస్ట్ దామోదర్ మృతదేహానికి బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నివాళులర్పించి, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి, సంతాపాన్ని తెలిపారు. ఇలాంటి విషాద సమయంలో బీఆర్ఎస్ పార్టీ తరఫున వారి కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వెంట బీఆర్ఎస్ ఎమ్మెల్యే వివేకానంద గౌడ్, క్రిశాంక్ తదితరులు ఉన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సంతాపం తెలంగాణ సీనియర్ వీడియో జర్నలిస్టు దామోదర్ మరణం పట్ల బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సంతాపం ప్రకటించారు. ఇండియా టుడే జాతీయ న్యూస్ ఛానల్లో పని చేస్తున్న దామోదర్, తాను పార్టీ స్థాపించిన తొలినాటి నుంచీ, తెలంగాణ ఉద్యమ వార్తల కవరేజ్ లో చురుకుగా పాల్గొనే వాడని, కేసీఆర్ గుర్తు చేసుకున్నారు. విధి నిర్వహణలో ఉన్న దామోదర్ అకాల మృతి పట్ల విచారం వ్యక్తం కేసీఆర్ చేశారు. వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ సంతాపం

విధి నిర్వహణలో గుండెపోటుకు గురై నెలకొరిగిన "ఆజ్ తక్" ఛానెల్ వీడియో జర్నలిస్ట్ దామోదర్ మరణం పట్ల టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు కె. విరాహత్ అలీ సంతాపం వ్యక్తం చేశారు. దామోదర్‌కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

సెంటిమెంట్ రగిల్చి

లబ్ధి పొందేందుకు బీఆర్ఎస్ యత్నం

- టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్

ప్రతిపక్షం, హైదరాబాద్, డిసెంబర్ 4: సెంటిమెంట్ రగిల్చి లబ్ధి పొందేందుకు బీఆర్ఎస్ యత్నిస్తోందని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. హిల్ట్ పాలసీ ద్వారా భూముల ధరలు తగ్గుతాయని, సామాన్యులకు భూముల ధరలు అందుబాటులో వస్తాయని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కొణిజేటి రోశయ్య, ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం ఒక ప్రాంతానికి చెందిన వారు కాదని, ఈ దేశానికి వారు సంపద అని కొనియాడారు. ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం విగ్రహం రవీంద్రభారతిలో ఉంటే తప్పేంటి? అని మహేష్ ప్రశ్నించారు. బిజెపి కోసమే కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పనిచేస్తున్నారని, కాలుష్యరహితంగా హైదరాబాద్ మారుతుందని తెలియజేశారు. అవినీతికి అలవాటు పడిన మాజీ సిఎం కెసిఆర్ కుటుంబానికి తమ ప్రభుత్వం ఏం చేసినా అవినీతి అంటూ విమర్శించడం అలవాటుగా మారిందని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

హిల్ట్ పేరిట రాష్ట్ర ప్రభుత్వం రియల్ ఎస్టేట్ వ్యాపారం

- దేశ చరిత్రలోనే అతిపెద్ద రియల్‌ఎస్టేట్ కుంభకోణం
- పాశమైలారం పారిశ్రామికవాడలో బీఆర్ఎస్ నేతల పర్యటన

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, డిసెంబర్ 4: హిల్ట్ పేరిట రాష్ట్ర ప్రభుత్వం రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుందని మాజీమంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ విమర్శించారు. హైదరాబాద్ మహానగర ప్రాంతంలో హిల్ట్ ప్రాజెక్ట్ పేరుతో రూ.5 లక్షల కోట్ల విలువైన పారిశ్రామిక భూములను ప్రైవేట్ వ్యక్తులకు బదిలీ చేయాలనే కాంగ్రెస్ ప్రభుత్వ కుట్రను అడ్డుకునేందుకు మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు ఆదేశాల మేరకు పటాన్‌చెరు నియోజకవర్గంలోని పాశమైలారం పారిశ్రామికవాడలో బీఆర్ఎస్ పార్టీ నేతలు ప్రత్యేక పర్యటన నిర్వహించారు. గురువారం పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ ఆదర్శ్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ గడీల శ్రీకాంత్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పర్యటనలో మాజీమంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, జహీరాబాద్ ఎమ్మెల్యే మనిక్‌రావు, డీసీఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్, మాజీ బెవరేజెస్ చైర్మన్ దేవి ప్రసాద్, మాజీ ఎస్టీ,ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ఎర్రోల్ల శ్రీనివాస్ లు పర్యటించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాట్లాడుతూ... పటాన్‌చెరు ప్రాంతంలో మొత్తం 1,188 ఎకరాలు, పాశమైలారం పారిశ్రామికవాడలో 1,495 ఎకరాలు, మొత్తం కలిపి 2,708 ఎకరాల పారిశ్రామిక భూములను హిల్ట్ పేరిట మోసం చేస్తుందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ప్రయోజనాలను నిర్వీర్యం చేసే కుట్రలో భాగంగా హిల్ట్ పాలసీని తెచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది దేశ చరిత్రలోనే అతిపెద్ద రియల్ఎస్టేట్ కుంభకోణమని పేర్కొన్నారు. పటాన్‌చెరు, పాశమైలారం పరిశ్రమలను తరలిస్తే వేలాది మంది కార్మికులు నిరుద్యోగులవుతారని ఆందోళన వ్యక్తం చేశారు. కాలుష్య రహిత పరిశ్రమలపైనా ప్రభుత్వం బలవంతపు తరలింపులకు సిద్ధమవుతోందని విమర్శించారు. హిల్ట్ పాలసీ అమలు చేస్తే బీఆర్ఎస్ పార్టీ పెద్దఎత్తున ప్రజా ఆందోళనలు చేపడుతుందని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం హిల్ట్ పాలసీపై పట్టుబడితే ఆదిలో రైతుల నుంచి రూ.3,000 ఎకరాకు కొనుగోలు చేసిన భూముల్లో కనీసం 50% రైతులకు తిరిగి ఇవ్వాలని అన్నారు. ఇంకా కోర్టుల్లో న్యాయం కోసం పోరాడుతున్న రైతులకు ప్రాధాన్యతతో పరిష్కారం ఇవ్వాలని తెలిపారు. లేకపోతే ఆ భూములను ప్రజల ప్రయోజనాల కోసం ప్రభుత్వం పూర్తిగా అభివృద్ధి చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పటాన్ చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, జిన్నారం మాజీ జెడ్పీటీసీ బాల్ రెడ్డి, తెల్లాపూర్ మాజీ సర్పంచ్ సోమిరెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాచకొండ, సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ వెబ్‌సైట్ల హ్యాక్



ప్రతిపక్షం, హైదరాబాద్, డిసెంబర్ 4: తెలంగాణ పోలీసులకు సైబర్ నేరగాళ్లు షాకిచ్చారు. ఇటీవలే హైకోర్టు వెబ్‌సైట్‌ను హ్యాక్ చేసిన సైబర్ క్రిమినల్స్.. తాజాగా రాచకొండ, సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ వెబ్‌సైట్లను పనిచేయకుండా చేశారు. దీంతో గడ పది రోజులుగా రెండు కమిషనరేట్ల వెబ్‌సైట్లు పూర్తిగా నిలిచిపోయాయి. వీటిలోకి మాల్‌వేర్ చొరబడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. వెబ్‌సైట్లను క్లిక్ చేస్తే అధికారిక సమాచారానికి బదులుగా గేమింగ్ సైట్లకు రీడైరెక్ట్ అవుతున్నట్లు గుర్తించారు. దీంతో సర్వర్లను డౌన్ చేసి వాటిని నిర్వహిస్తున్న ఎన్ఐసీకి సమాచారం అందించారు. సమస్యను పరిష్కరించేందుకు రెండు కమిషనరేట్లలోని ఐటీ బృందాలు యత్నిస్తున్నాయి. వెబ్‌సైట్ల పునరుద్ధరణకు ఎన్ఐసీ పర్యవేక్షణలో ప్రతినిధులు పనిచేస్తున్నారు. రెండు కమిషనరేట్ల పోలీస్ సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేస్తున్నారు. మళ్లీ హ్యాకింగ్ కాకుండా అధునాతన ఫైర్‌వాల్స్ ఆడిట్ చేస్తున్నారు. ఆడిహ్యాకింగ్‌కు కారణమైన ముఠాలను గుర్తించేందుకు సైబర్ క్రైమ్ పోలీసులతో సమన్వయం చేస్తూ సర్వర్‌ల భద్రతను బలోపేతం చేసే పనిలో నిమగ్నమయ్యారు. కాగా, ఇదే తరహాలో పలు ప్రభుత్వ శాఖల వెబ్‌సైట్లు కూడా హ్యాక్ అయినట్లు సమాచారం. ఇప్పటికే డార్క్ వెబ్‌లో 22 వెబ్‌సైట్లకు సంబంధించిన సమాచారం అందుబాటులో ఉందని సైబర్ నిపుణులు చెబుతున్నారు.

9,300 ఎకరాల విలువైన భూములు ప్రయివేటుకు

- హైదరాబాద్ పారిశ్రామిక భూములపై ఐదు లక్షల కోట్ల భూ కుంభకోణం
- భూములను తిరిగి స్వాధీనం చేసుకోవాలి
- పేదలకు ఇళ్లు, పాఠశాలలు, ఆసుపత్రులు ఏర్పాటు చేయాలి
- బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- జీడిమెట్ల ఇండస్ట్రియల్ ఏరియాల్లో బీఆర్ఎస్ బృందంపర్యటన

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్ 4: హిల్టిప్ పాలసీ ద్వారా ప్రభుత్వం 9,300 ఎకరాల విలువైన భూములను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగిస్తుందని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ఈ చర్య వల్ల నగరంలో ఉపాధి, పరిశ్రమల భవిష్యత్తు ప్రమాదంలో పడతుందని, భూములను తిరిగి స్వాధీనం చేసుకుని పేదలకు ఇళ్లు, పాఠశాలలు, ఆసుపత్రులు ఏర్పాటు చేయాలన్న డిమాండ్ చేశారు. హైదరాబాద్ పారిశ్రామిక వాడల్లో భారీ భూ కుంభకోణం జరుగుతోందని, హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్స్ ట్రాన్స్‌ఫార్మేషన్ పాలసీ పేరుతో 5 లక్షల కోట్ల రూపాయల విలువైన భూములను ప్రభుత్వం ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించే కుట్ర జరుగుతోందని బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా ఆరోపించింది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యేలు, పార్టీ నేతలు కలిసి కుత్బుల్లాపూర్, జీడిమెట్ల ఇండస్ట్రియల్ ఏరియాల్లో పర్యటించారు. కుత్బుల్లాపూర్ షాపూర్ ప్రాంతంలో హమాలీలతో కూడా కేటీఆర్ మాట్లాడారు. కేటీఆర్ మాట్లాడుతూ, గత కాలంలో ప్రభుత్వం ప్రజల కోసం, పరిశ్రమల అభివృద్ధి కోసం, ఉపాధి కల్పన కోసం ఇచ్చిన పారిశ్రామిక భూములను కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు ప్రైవేట్ డెవలపర్లకు అప్పగించే ప్రయత్నం చేస్తోందని తీవ్ర విమర్శలు గుప్పించారు. పరిశ్రమలు పెట్టి ఉద్యోగాలు కల్పించాలన్న షరతులతో ఇచ్చిన భూములపై ఇప్పుడు అపార్ట్‌మెంట్లు, విల్లాలు, కమర్షియల్ కాంప్లెక్స్‌లు కట్టుకునేందుకు అనుమతులు ఇస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. జీడిమెట్ల, కుత్బుల్లాపూర్ వంటి ప్రాంతాల్లో మార్కెట్ ధర గజానికి లక్ష రూపాయలు దాటుతున్నా, ప్రభుత్వం కేవలం 4,000 రూపాయలకే భూములను అప్పగించడానికి సిద్ధమవడం కుంభకోణానికి నిదర్శనమని కేటీఆర్ అన్నారు. హైదరాబాద్ నగరంలో పేదలకు ఇండ్లు, పాఠశాలలు, ఆసుపత్రులు, స్మశానాల కోసం కూడా స్థలం లేకపోయినా, ప్రైవేట్ వ్యక్తులకు 9,300 ఎకరాల విలువైన భూమిని అప్పనంగా ఇస్తున్నట్లు ఆరోపించారు. ఈ 9,300 ఎకరాల భూమిని తిరిగి స్వాధీనం చేసుకొని, ఇందిరమ్మ ఇండ్లు, యంగ్ ఇండియా స్కూల్స్, ఆసుపత్రులు నిర్మించాల్సిందిగా డిమాండ్ చేశారు. నగరంలో స్థలం లేదని చెప్పి ఇప్పటి వరకు ఒక్క ఇందిరమ్మ ఇల్లూ కట్టని కాంగ్రెస్ ప్రభుత్వం ఎవరి ప్రయోజనాల కోసం ఇలా వ్యవహరిస్తోందో ప్రజలకు చెప్పాలని కోరారు. భూముల ధర నిర్ణయం ఎలా జరిగింది, ప్రభుత్వం ఏ ప్రమాణాలతో ఈ నిర్ణయాలు తీసుకుంటోంది అనే విషయాలు ప్రజలకు తెలియాల్సిందేనని అన్నారు. హిల్టిప్‌పాలసీని వ్యతిరేకిస్తూ త్వరలో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేస్తామని, కాలనీల్లో ప్రజలకు విషయాన్ని వివరించి రౌండ్ టేబుల్ సమావేశాలు కూడా నిర్వహిస్తామని తెలిపారు. ఈ పాలసీని రద్దు చేయించే వరకు, అవసరమైతే కోర్టులను ఆశ్రయించేవరకు బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం వస్తే ఇందుకు సంబంధించిన పాలసీని పూర్తిగా రద్దు చేసేందుకు చట్టం తీసుకువస్తామని హామీ ఇచ్చారు. పారిశ్రామిక భూముల పేరుతో జరుగుతున్న ఈ దోపిడీలో పాల్గొనవద్దని పరిశ్రమల యజమానులకు విజ్ఞప్తి చేశారు. అత్యాశతో ప్రభుత్వానికి డబ్బులు కడితే భూములూ, డబ్బులూ రెండూ కోల్పోతారని హెచ్చరించారు. ఫార్మాసిటీ కూడా రియల్ ఎస్టేట్ వ్యాపారానికి వాడుకుపోతోందని, "ఫ్యూచర్ సిటీ" పేరుతో రేవంత్ రెడ్డి ఫార్మాసిటీ భూముల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని, ఆయనకు తెలిసింది కేవలం రియల్ ఎస్టేట్ దందానేనని కేటీఆర్ ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కేపీ వివేకానంద, నాయకులు పాల్గొన్నారు.

మిలిగిరిపేట సర్పంచ్ ఏకగ్రీవం

- సర్పంచ్ షాబుద్దిన్ కు జగ్గారెడ్డి సన్మానం

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, డిసెంబర్ 4 : సదాశివపేట మండలం మిలిగిరిపేట గ్రామంలో సర్పంచ్‌గా కాంగ్రెస్ పార్టీ నాయకుడు షాబుద్దిన్ ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా, సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేసి ఆయనను ఘనంగా సన్మానించారు. గ్రామ ప్రజలు సమైక్యంగా తీసుకున్న ఈ నిర్ణయం అభినందనీయమని, అభివృద్ధి దిశగా మిలిగిరిపేటకు ఇది కొత్త ఆరంభమని జగ్గారెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్‌గా షాబుద్దిన్ ఎన్నిక కావడంలో కీలక పాత్ర పోషించిన గ్రామ పెద్దలందరినీ జగ్గారెడ్డి ప్రత్యేకంగా సన్మానించారు. మాజీ సర్పంచ్ రామ్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మధుకర్ రెడ్డి, ఏషోబు, ఉషయ్య, హన్మంత రెడ్డి, బ్రహ్మానంద రెడ్డి, యాదయ్య, నారాయణ, సంజీవ రెడ్డి, దానయ్య, యాధుల్ తదితరులు గ్రామ ఏకగ్రీవ నిర్ణయానికి అండగా నిలిచినందుకు నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడిన జగ్గారెడ్డి, మిలిగిరిపేట గ్రామ అభివృద్ధికి తన పూర్తి స్థాయి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. గ్రామ ప్రజలు ఏకగ్రీవంగా సూచించిన కొత్త నాయకత్వం గ్రామాన్ని అభివృద్ధి మార్గంలో ముందుకు తీసుకెళ్తుందన్న విశ్వాసం వ్యక్తం చేశారు. గ్రామ ప్రజల ఐక్యతకు, అందించిన మద్దతుకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ జూలకంటి ఆంజనేయులు, బ్లాక్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మరియు సిడిసి చైర్మన్ గడీల రామ్ రెడ్డి, సదాశివపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సిద్దన్న తదితరులు పాల్గొన్నారు. నాయకుల సన్మాన కార్యక్రమంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

నేను చదువుకునే రోజుల్లో అవగాహన లేక హిందీ వ్యతిరేక ఉద్యమంలో పాల్గొన్నా. మాతృభాషకు ప్రాధాన్యం ఇచ్చి, ఆ తర్వాత సోదర భాషలు నేర్చుకోవాలి. ఏపీ, తెలంగాణలు తెలుగును పరిపాలనా భాషగా చేసుకోవాలి. తెలుగు చదువుకుంటేనే ఉద్యోగం ఇస్తామని చెప్పాలి. అప్పుడే తెలుగు వెలుగుతుంది.

- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు

ఓపెన్ వాయిస్

అయ్యో, మన రూపాయి!!

రూపాయి మారకం విలువ రోజురోజుకు క్షీణిస్తున్నది. అంతర్జాతీయ మార్కెట్ లో యూఎస్ డాలర్‌కు డిమాండ్ రావడంతో రూపాయి జీవితకాలపు కనిష్ఠ స్థాయికి చేరింది. ఇప్పటికే 90.15 స్థాయికి పడిపోయిన విలువ గురువారం మరో 28 పైసలు కోల్పోయి ఆల్‌టైం హైకి 90.43కి పడిపోయింది. రూపాయి విలువ పతనం మరికొన్ని రోజుల పాటు కొనసాగే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం రూ.90.70 మార్కును తాకుతుందని పేర్కొన్నారు. కాగా, బుధవారం ఉదయం 89.96వద్ద ప్రారంభమైన డాలర్ రుపీ ఎక్స్ఛేంజ్ రేటు ఇంట్రాడేలో 90.30 స్థాయికి పతనమైంది. చివరకు ముగింపుతో పోలిస్తే 19 పైసలు తగ్గి 90.15కి జారుకున్నది. మంగళవారం రూపాయి విలువ 43 పైసలు కోల్పోయి 89.96కి పడిపోయింది. దిగుమతిదారుల నుంచి అమెరికా కరెన్సీకి డిమాండ్ నెలకొనడం రూపాయి పతనానికి ఆజ్యంపోసిందని ఫారెక్స్ డీలర్ వెల్లడించారు. ప్రస్తుత సంవత్సరంలో డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ ఐదు శాతం పతనం చెందింది. అంతర్జాతీయంగా అన్ని కరెన్సీలు తీవ్ర హెచ్చుతగ్గుదలకు గురవుతున్నాయని, ఇటు ఇదే క్రమంలో రూపాయి పతనం చెందింది తప్పా, బలహీనమైన కరెన్సీ మాత్రం కాదని ఎస్బీఐ ఎకానమిక్ రీసర్చ్ డిపార్ట్‌మెంట్ విడుదల చేసిన నివేదిక వెల్లడించింది. ఈవారంలోనే వడ్డీ రేట్ల తగ్గింపుపై రిజర్వు బ్యాంక్ నిర్ణయం తీసుకోనుండటం రూపాయి పతనానికి బ్రేక్ వేయవచ్చని వారు అభిప్రాయపడ్డారు. స్వల్ప కాలంలో డాలర్ రుపీ ఎక్స్ఛేంజ్ రేటు 89.90 నుంచి 91.20 మధ్యలో నమోదు కానున్నదని విశ్లేషకులు అంచనావేస్తున్నారు. విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు రూ.3,206 కోట్ల షేర్లను విక్రయించడం కూడా రూపాయి పతనానికి ఆజ్యం పోసింది. దేశీయ ఎగుమతులు నీరసించడం, వాణిజ్య ఒప్పందంపై ప్రతిష్ఠంభన నెలకొనడం విదేశీ పెట్టుబడిదారులలో ఆందోళనన నెలకొన్నది. ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం రూపాయి పతనంతో దేశీయ ఆర్థిక వ్యవస్థ మీద కూడా ప్రతికూల ప్రభావం చూపనున్నదని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా దిగుమతులపై అత్యధికంగా ఆధారపడుతున్న భారత్ మీద ఈ ప్రభావం ఎక్కువగా ఉంటుందని వెల్లడిస్తున్నారు. చమురు బిల్లుల కోసం అధికంగా వెచ్చించాల్సి రావచ్చునని అంటున్నారు. ముఖ్యంగా దేశీయ వినిమయంలో 80 శాతం దిగుమతులపై ఆధారపడుతున్న భారత్‌కు ఇది పెద్ద దెబ్బేనని వారు అంటున్నారు. భారంగా మారిన విదేశాలలో ఉన్నత విద్య రోజురోజుకూ దారుణంగా పడిపోతున్న రూపాయి విలువ కంటికి కనిపించని దెబ్బ కొడుతున్నది. డాలరుతో రూపాయి మారకం విలువ బుధవారం రూ.90 దాటింది. రూపాయి విలువ బలహీనపడుతున్నకొద్దీ దిగుమతి సరుకుల ధరలు భారీగా పెరుగుతుండగా, ఎగుమతి అయ్యే వస్తువులు చౌకగా మారిపోతున్నాయి. ముఖ్యంగా చమురు, ఎలక్ట్రానిక్స్ వస్తువుల ధరలు భారీగా పెరుగుతున్నాయి. పతనమవుతున్న రూపాయి విలువతో ప్రధానంగా ప్రభావితమవుతున్నవారు విదేశాలలో చదువుకుంటున్న భారతీయ విద్యార్థులు. ఇది వారి కుటుంబాలను కనిపించని రీతిలో దెబ్బ కొడుతున్నది. రూపాయి విలువ తగ్గడం కారణంగా అమెరికా, బ్రిటన్, ఇటలీ, జర్మనీ, సింగపూర్, ఆస్ట్రేలియా తదితర దేశాలలో చదువుతున్న విద్యార్థులు, వారి కుటుంబాలకు ఆర్థిక భారం తడిసి మోపెడవుతున్నది. ఇటు రూపాయి పతనం, అటు విద్యార్థుల వార్షిక ఫీజు, వారి జీవనంపై భారం మోపుతున్నది. ఫీజులు లక్షలలో పెరుగుతున్నాయి. అదే సమయంలో ఇటు విదేశీ మారకంలో తీసుకున్న విద్యా రుణాలు కూడా పెరిగిపోతున్నాయి. నిరుడు భారత్ నుంచి విదేశాలకు చదువుకోవడానికి వెళ్లిన వారి సంఖ్య 7.6 లక్షలు. న్యూయార్క్ వర్సిటీలో చదువుతున్న సంజనా కుమార్ తన అనుభవాన్ని చెబుతూ 'మా తల్లిదండ్రులు నాకు ఖర్చుల కోసం నెలకు 1500 డాలర్లు పంపుతారు. నిరుడు డాలర్ విలువ రూ.83.5 ఉన్నప్పుడు నా తల్లిదండ్రులకు రూ.1.25 లక్షలు ఖర్చయ్యేవి. ఇప్పుడు అవే 1500 డాలర్లకు వారికి మరో రూ.10 వేలు ఎక్కువగా ఖర్చవుతున్నాయి' అని వివరించారు.

ప్రతిపక్షం
హైదరాబాద్,
శుక్రవారం
05.12.2025

సర్పంచ్ పదవి రాజకీయ వ్యాపారమా?!

మార్పు సులభం కాదు. కానీ అసంభవం కూడా కాదు. గ్రామ ప్రజలు ఓటుకు విలువ ఇవ్వాలి. అభ్యర్థి వ్యక్తిత్వం, సేవా చరిత్ర ఆధారంగా ఓటు వేయాలి. నాయకుల ఖర్చుల సంస్కృతి వ్యతిరేకించాలి. పంచాయతీ సమావేశాలు ప్రజల ముందే జరిగేలా చూడాలి. పనులలో పారదర్శకత కోరాలి. ప్రజలు మారితే, నాయకులు కూడా మారాల్సిందే. సత్యం ఏంటంటే గ్రామ రాజకీయాల భవిష్యత్తు సర్పంచ్ వద్ద లేదు, ప్రజల చేతులలో ఉంది. పది వేల జీతం రాని సర్పంచ్ పదవికి పది లక్షలు ఖర్చు అవుతున్నాయంటే అది ఒక వ్యవస్థ సమస్య. అది ఒక సామాజిక అలవాటు. అది ఒక ప్రజాస్వామ్యపు వేదన. ఎవరు పోటీ చేస్తున్నారనేది కాదు, ఎందుకు పోటీ చేస్తున్నారనేదే అసలు ప్రశ్న. ఎవరైనా గ్రామ ప్రజల కోసం నిర్మాణాత్మక అభివృద్ధి కోసం స్వచ్ఛమైన రాజకీయాల కోసం పోటీ చేస్తే ఆ గ్రామం అడుగు అడుగుకు ఎదుగుతుంది.

జనగాం ప్రసాద్ రావు
76720 82695

గ్రామం అంటే భారతదేశపు ప్రాణం. గ్రామ సమాజం అంటే మనిషి బాంధవ్యానికి అద్దం. గ్రామ పంచాయతీ అంటే ప్రజాస్వామ్యపు మొదటి మెట్టు.ఈ మెట్టుపైనే సర్పంచ్ అనే పదవి నిలబడి ఉంటుంది. అదే పదవి జీతం పది వేల రూపాయలైనా రాని పదవి. ఆ పదవిని సాధించడానికి ఇంతకీ ఎందుకు పది లక్షలు, ఇరవై లక్షలు, కొన్నిసార్లు కోట్లు ఖర్చు అవుతున్నాయి? ఎవరి కోసం ఎందుకోసం? ఏ ఆశతో? ఈ ప్రశ్నకు సమాధానం వెతకడం అంటే గ్రామ రాజకీయాల హృదయాన్ని కొట్టినట్టే. సర్పంచ్ పదవి: జీతం చిన్నది. ఆశలు పెద్దవి. సర్పంచ్‌కు ప్రభుత్వంగా ఇచ్చే హోదా చిన్నదే. జీతం కూడా పెద్దది కాదు. కాగితాల మీద చూస్తే ఈ పదవి సేవా పదవి మాత్రమే. అయితే, ఎందుకు ప్రతి ఎన్నికల సమయంలో, ప్రతిఒక్కరూ పోటీ వేడెక్కుతారు? ఎందుకు పెద్ద పెద్ద ఖర్చులు చేస్తారు? ఎందుకు ఓటరుకు బియ్యం సంచి, మద్యం, నోట్ల కట్టలు పంపిణీ అవుతాయి? అది సేవ కోసమా? లేక పోయిన డబ్బు సంపాదించుకోవాలనే కోసమా?

ఖర్చు అనేది పెట్టుబడి అన్న భావన

గ్రామాలలో చాలామంది నాయకుల దృష్టిలో సర్పంచ్ ఎన్నికలు అంటే ఒక ఇన్వెస్ట్మెంట్. అంటే ముందుగా డబ్బు ఖర్చు చేయాలి. వెంటనే ప్రతిఫలం రాకపోయినా, ప్రభావం, శక్తి, అధికారంతోఆ తర్వాతి ఐదు సంవత్సరాలలో ఆ పెట్టుబడిని తిరిగి తెచ్చుకోవచ్చనే నమ్మకం. కొందరికి ఇది ప్రముఖత కోసమే. కొందరికి కుటుంబ పేదరికం నుంచి బయటపడే మార్గం. కొందరికి మాత్రం వ్యక్తిగత వ్యాపారాలు పెంచుకోవడానికి రాజకీయ ముసుగు. అందుకే ఖర్చు, అందుకే పోటీ, అందుకే హడావిడి, సర్పంచ్ పదవిలో ఉన్న అసలు శక్తి ఏమిటి? డబ్బు కోసమే అయితే, ఆ అవకాశాలు ఎక్కడ? సర్పంచ్‌కు ఉన్న అధికారాలు పెద్దవి కాకున్నా, గ్రామంలో జరిగే ప్రతి అభివృద్ధి పనికి సంతకం సర్పంచ్‌దే. రోడ్లు, కాల్వలు, కమ్యూనిటీ హాళ్లు, బోరు బావులు, శుభ్రత పనులు, పథకాలు, భూ సర్టిఫికెట్లు, నిర్మాణ అనుమతులు, ఫండ్ల వినియోగం, ఈ పనులన్నింటిలో 'అక్కడ ఓ శాతం, ఇక్కడ ఓ లాభం' అని అనుకుంటే, పది లక్షలు పెట్టి పదింతలు వచ్చేయొచ్చు అనే లెక్క చాలా మందికి. ఇది ఇష్టపడతామా, లేదంటే వ్యతిరేకమా అన్నది పక్కన పెడితే, ఇది అనేక గ్రామాలలో జరుగుతున్న వాస్తవం.

అందరూ దేనికోసం పోటీ చేస్తారు?

అందరూ కేవలం డబ్బు కోసమేనా? అలా కాదు. ఆదిలో ఈ పదవి నిజంగా సేవాభావంతో చేపట్టిన మహానుభావులు కూడా ఉన్నారు. వాళ్ల లక్ష్యం: గ్రామాన్ని మార్చాలి. అటు శుభ్రత పెంచాలి, నీరు, రోడ్లు, విద్య, ఆరోగ్యంలో కొత్తదనం తీసుకురావాలి, వంద మందికి ఉపాధి ఇవ్వాలి, ప్రజలు ఎదగాలి, అటువంటి వారి కోసం సర్పంచ్ పదవి ఒక మిషన్. కానీ, వారే తక్కువ. వాళ్ల ముందున్న పెద్ద సమస్య డబ్బు ఖర్చు చేసే ప్రత్యర్థులు. ఈ పరిస్థితిలో మంచి మనసున్న వ్యక్తిఎన్నికలను గెలవడానికి పోరాటం చేసే అవకాశం తగ్గిపోతుంది. గ్రామ ప్రజల పాత్ర: మార్పు ఎక్కడ మొదలవుతుంది? ఓటు వేయడానికి డబ్బు తీసుకుంటే మార్పు ఎలా వస్తుంది? ప్రజలే నాయకులకి డబ్బు ఖర్చు చేయాల్సిన పరిస్థితి తీసుకొస్తున్నారు. ఓటు కోసం బహుమతులు ఆశిస్తారు. ఎన్నికలు వచ్చినప్పుడు డబ్బు ఇవ్వని అభ్యర్థిని లైట్‌గా తీస్తారు. ఎవరు ఎక్కువ ఇచ్చేరో వాళ్లకే ఎక్కువగానే ఓట్లు. అప్పుడు ఎన్నికల తర్వాత నాయకులు, 'డబ్బు వేసి గెలిచిన పదవి' అనే భావనతో ఆ డబ్బు తిరిగి తీసుకోవడానికి యత్నిస్తే మనం ఎత్తి చూపే అవకాశం ఎలాగూ లేదు.

ఎందుకంటే, మనమే మొదట తప్పు చేశాం.

మార్పు ఎలా వస్తుంది?

మార్పు సులభం కాదు. కానీ అసంభవం కూడా కాదు. గ్రామ ప్రజలు ఓటుకు విలువ ఇవ్వాలి. అభ్యర్థి వ్యక్తిత్వం, సేవా చరిత్ర ఆధారంగా ఓటు వేయాలి. నాయకుల ఖర్చుల సంస్కృతి వ్యతిరేకించాలి. పంచాయతీ సమావేశాలు ప్రజల ముందే జరిగేలా చూడాలి. పనులలో పారదర్శకత కోరాలి. ప్రజలు మారితే, నాయకులు కూడా మారాల్సిందే. సత్యం ఏంటంటే గ్రామ రాజకీయాల భవిష్యత్తు సర్పంచ్ వద్ద లేదు, ప్రజల చేతులలో ఉంది. పది వేల జీతం రాని సర్పంచ్ పదవికి పది లక్షలు ఖర్చు అవుతున్నాయంటే అది ఒక వ్యవస్థ సమస్య. అది ఒక సామాజిక అలవాటు. అది ఒక ప్రజాస్వామ్యపు వేదన. ఎవరు పోటీ చేస్తున్నారనేది కాదు, ఎందుకు పోటీ చేస్తున్నారనేదే అసలు ప్రశ్న. ఎవరైనా గ్రామ ప్రజల కోసం నిర్మాణాత్మక అభివృద్ధి కోసం స్వచ్ఛమైన రాజకీయాల కోసం పోటీ చేస్తే ఆ గ్రామం అడుగు అడుగుకు ఎదుగుతుంది. కానీ, ఎవరైనా డబ్బు పెట్టి డబ్బు సంపాదించడానికి పోటీ చేస్తే, అప్పుడు అభివృద్ధి కన్నా వ్యక్తిగత లాభాలు పెద్దవి అవుతాయి. అందుకే, ప్రజలే నిర్ణయించాలి. సర్పంచ్ సేవకుడా? లేక పాలకుడా?!

(వ్యాస రచయిత సామాజిక విశ్లేషకుడు, పూసూరు)

స్వచ్ఛంద కృషే అత్యున్నత ఆరాధన

ముహమ్మద్ అబ్దుల్ మాజిద్
9966112448

మానవుడిగా మన ఉనికికి, విశ్వాసానికి మూల స్తంభం- తోటి మానవుడికి సేవ చేయడం. ఇది కేవలం ఒక సామాజిక బాధ్యత కాదు, ప్రతి విశ్వాసి ఆచరించాల్సిన అత్యున్నత ఆరాధన (ఇబాదా). సంక్షోభ భరిత ప్రపంచంలో, మన సమాజాలకు అత్యవసరంగా కావలసింది ఆర్థిక విరాళాలు (డొనేషన్స్) మాత్రమే కాదు; నిస్వార్థ సేవ, మానవీయ స్పర్శ, నిబద్ధతతో కూడిన ప్రయత్నం. మనం అల్లాహ్ 'ఖిలాఫా' (ప్రతినిధులు)గా ఈ భూమిపై సామరస్యాన్ని, శాంతిని పెంపొందించడానికి నియమించబడ్డాము. ఈ ధర్మకర్తృత్వమే మన సాధారణ పనులను సైతం పవిత్ర ఆరాధనగా మారుస్తుంది. దివ్య ఖురాన్ మన జాతికి ఒక మహోన్నత లక్ష్యాన్ని నిర్దేశించింది. 'మీరు మానవజాతి కొరకు సృష్టించబడిన ఉత్తమ జాతి. మీరు మంచిని ఆదేశిస్తారు చెడును నిరోధిస్తారు' (3: 110). ఈ ఆదేశం మనలను కేవలం విశ్వాసులుగానే కాక, న్యాయం కోసం నిలబడే కార్యకర్తలుగానూ, సమాజ హితాన్ని కాంక్షించే పౌరులుగానూ తీర్చిదిద్దుతుంది. ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) బోధనలు ఈ సేవా స్ఫూర్తికి ప్రాణం పోశాయి. 'మీలో ఉత్తములు ఎవరంటే, ఇతరులకు ప్రయోజనాలను చేకూర్చేవారే. అంతేకాదు, ఒక హదీసులో, 'నా ముస్లిం సోదరుడి అవసరంలో నేను అతనితో నడవడం, ఒక నెలపాటు మసీదులో ఏకాంతంగా ఆరాధన చేసుకోవడం కంటే ప్రియమైనది' అని నొక్కి చెప్పబడింది.

ప్రయత్నపు సదఖా: ప్రత్యక్ష ప్రభావం

సాధారణంగా దానధర్మం అనగానే డబ్బు గుర్తుకొస్తుంది. కానీ స్వచ్ఛంద సేవ (వాలంటీరింగ్) అనేది డబ్బు కంటే ఎంతో ఉన్నత, శక్తివంతమైన దానధర్మం. ఆర్థిక విరాళాలు సంస్థలకు వెన్నెముక కావచ్చు, కానీ, స్వచ్ఛంద సేవకుల సమయం , నైపుణ్యాల అంకితభావం వాటికి భర్తీ చేయలేని, ఆర్థికేతర విలువను అందిస్తుంది. మానవీయ స్పర్శ (Human Touch): స్వచ్ఛంద సేవకులు లబ్ధిదారులతో నేరుగా కలిసి పనిచేస్తారు. ఒక వైద్యుడు ఉచితంగా వైద్యం అందించినప్పుడు, అది కేవలం చికిత్సగా మిగలదు. అది సానుభూతితో కూడిన సహాయం. ఇది పరోక్షంగా పంపే డబ్బు కంటే తక్షణ ఉపశమనాన్ని, గౌరవాన్ని, కరుణను అందిస్తుంది. నైపుణ్యాల భాగస్వామ్యం (Skill Sharing): వృత్తిపర నైపుణ్యాలను (అకౌంటెన్సీ, బోధన, సాంకేతికత) స్వచ్ఛందంగా అందించడం ద్వారా, కార్యకర్తలు కేవలం తాత్కాలిక సహాయం కాకుండా, జ్ఞానంతో సమాజాన్ని సాధికారత

వైపు నడిపిస్తారు. ఇది దీర్ఘకాలిక సామాజిక మార్పుకు మార్గం సుగమం చేస్తుంది.

దయార్ద్ర హృదయ స్పందన: ఓసియోలా మెక్‌కార్టీ

నిస్వార్థ దయ, ఉదారత అనే పదాలు తలచుకోగానే, వృద్ధ ఆఫ్రికన్ అమెరికన్ మహిళ ఓసియోలా మెక్‌కార్టీ కథ మన మనస్సును కదిలిస్తుంది. డెబ్బై యేండ్లుగా కేవలం ఇస్త్రీ, బట్టలు ఉతికే పనితోనే జీవితం వెళ్లదీసిన ఆమె, నిరాడంబరంగా జీవించింది. పేదరాలిగా కనిపించినా, ఆమె కష్టపడి సంపాదించిన ప్రతి పైసాను దాచుకుని, తన జీవితకాల పొదుపు అయిన 150,000 డాలర్లను, తాను పొందలేని విద్యను ఆఫ్రికన్ అమెరికన్ విద్యార్థులకు అందించేందుకు స్కాలర్‌షిప్‌ల రూపంలో విశ్వవిద్యాలయానికి విరాళంగా ఇచ్చింది. ఆమె మాటలలోనే చెప్పాలంటే, 'నేను ప్రతిదీ చేయలేను, కానీ, ఎవరికైనా సహాయం చేయడానికి ఏదైనా చేయగలను. నేను ఏమి చేయగలను, అది నేను చేస్తాను' ఈ వాక్యం మనందరి హృదయాలలో ప్రతిధ్వనించాలి. గొప్పగా ఇవ్వలేకపోవచ్చు, కానీ మన సమయాన్ని, శ్రమను, నైపుణ్యాలను నిస్సందేహంగా దానం చేయగలం. ఒకరి జీవిత పొదుపును ఇవ్వడం అసాధ్యం కావచ్చు, కానీ మన హృదయపూర్వక అంకితభావం ఇవ్వడం సుసాధ్యం.

వ్యవస్థీకృత నిర్వహణ: నిర్మాణ సంక్షోభాన్ని అధిగమించడం

గొప్ప ఆధ్యాత్మిక వారసత్వం ఉన్నప్పటికీ, నేటి స్వచ్ఛంద సేవ వ్యవస్థ తరచుగా ఒక నిర్మాణ సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. వాలంటీర్ కృషిని యాదృచ్ఛికంగా పరిగణించడం వలన, నిస్సత్తువ వంటి సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ పరిస్థితికి ప్రతిస్పందనగా, ఇస్లామిక్ వాలంటీర్ నిర్వహణ ఒక వృత్తిగా ఉద్భవించాలి. నిర్వాహకులు నాయకత్వం, వ్యూహాత్మక ఆలోచన, తాదాత్మ్యం ప్రత్యేక సమ్మేళనాన్ని కలిగి ఉండాలి.1. వాలంటీర్ల ప్రయత్నం వృథా కాకుండా, తెలివిగా మార్గనిర్దేశం చేయబడి, ఫలితాలు లెక్కించబడేలా చూస్తారు. 2. స్థానిక సంస్థలతో సహకరించడం ద్వారా, సహాయం పునరావృతం నివారించబడి, వనరులు అత్యంత సమర్థవంతంగా వినియోగించబడేలా చూస్తారు. అటు సమయాన్ని వృథా చేయకుండా అల్లాహ్ ప్రీతి కోసం, మానవాళి ప్రయోజనం కోసం మన పరిమిత ఖాళీ సమయాన్ని ఉపయోగించుకోవాలి. 'మీలో మంచి వైపునకు పిలిచేవారూ, మేలు చెయ్యండి అని ఆజ్ఞాపించేవారూ, చెడు నుండి వారించేవారూ కొందరు తప్పకుండా ఉండాలి. ఈ పనిని చేసేవారే సాఫల్యం పొందుతారు' (ఖురాన్ 3: 104). ఈ విజయాన్ని మనం కేవలం ప్రార్థనలతోనే కాక, వ్యవస్థీకృత సామాజిక సేవ ద్వారా సాధించాలి.

పిలుపుకు ప్రతిస్పందన: ఎవరు, ఎప్పుడు? (The Call to Action)

సమాజం నిరుద్యోగం, పేదరికం వంటి సవాళ్లతో సతమతమవుతున్న ఈ తరుణంలో, నిష్క్రియత్వానికి తావులేదు. 'వేరొకరు చేస్తారు' 'నా సహాయం అవసరం లేదు" అనే ఆలోచనలను విడనాడాలి. 'మనము కాకపోతే, ఎవరు? ఇప్పుడే కాకపోతే, ఎప్పుడు?' ప్రతి వ్యక్తికి అల్లాహ్ ప్రసాదించిన కొన్ని బలాలు, నైపుణ్యాలు ఉన్నాయి. స్వచ్ఛంద సేవ అనేది ఆ వరాలను ఉపయోగించి, ఉద్దేశంతో సేవ చేసి, మీ సమాజంలో నిర్మాణపర కరుణను తీసుకురావడానికి ఉన్న ఒక పవిత్ర మార్గం. మీ సమయాన్ని దానం చేయండి. మీ నైపుణ్యాన్ని అందించండి. మీ హృదయంతో నాయకత్వం వహించండి. మీ కృషి పవిత్రమైనది. అది మీకు వ్యక్తిగత సంతృప్తిని, ఆధ్యాత్మిక ఎదుగుదలను అంతిమంగా దైవిక ప్రతిఫలాన్ని సంపాదించే మార్గాన్ని అందిస్తుంది. సేవ కేవలం ఒక విధి కాదు; ఇది అత్యున్నత ఆరాధన.

(నేడు ఇంటర్నేషనల్ వాలంటీర్ డే)

(వ్యాసకర్త ఆధ్యాత్మిక రచయిత)

నేలను పరిరక్షించడం సామాజిక బాధ్యత

రామకిష్టయ్య సంగనభట్ల
9440595494

ప్రపంచ వ్యాప్తంగా డిసెంబర్ ఐదున ప్రపంచ నేల దినోత్సవం జరుపుకుంటారు. ఈ రోజు మట్టిని రక్షించడానికి, దాని ప్రాముఖ్యతను గుర్తు చేసుకోవడానికి మనకు గొప్ప అవకాశం. నేల మానవజాతి జీవనాధారంగా ఉంది. తినే ఆహారం, ధరించే దుస్తులు, నివసించే ఇళ్లు అన్నీ ఈ నేలపైనే ఆధారపడి ఉంటాయి. అందుకే, నేల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయడం అత్యవసరం. ప్రపంచ నేల దినోత్సవానికి సంబంధించిన ఆలోచన ఇంటర్నేషనల్ యూనియన్ ఆఫ్ సాయిల్ సైన్సెస్ ద్వారా 2002లోనే మొదలైంది. థాయ్‌లాండ్ మహారాజు రామ జయంతి సందర్భంగా ఈ దినోత్సవాన్ని ఏర్పాటు చేశారు. 2013లో ఐక్యరాజ్య సమితి దీన్ని అధికారికంగా గుర్తించింది. ప్రతి యేడాది ప్రత్యేక థీమ్ ప్రకారం ఈ దినోత్సవం జరుపుకుంటారు. 2025 సంవత్సరానికిగాను థీమ్: 'Soils where food begins' ఈ థీమ్ మన ఆహార ఉత్పత్తిలో నేల కీలకమైన పాత్రను తెలియజేస్తుంది. ప్రపంచంలోని 95 శాతం ఆహారం నేల నుంచే ఉత్పత్తి అవుతుంది. పంటల పెరుగుదల, నాణ్యత అన్నీ మట్టిపై ఆధారపడి ఉంటాయి. నేల మట్టి కార్బన్ ను గ్రహించి గ్లోబల్ వార్మింగ్ తగ్గించడంలో సహాయపడుతుంది. పర్యావరణ సమతుల్యతకు నేల కీలకమైన ఆవాసం. నేల ద్వారా వర్షపు నీరు భూగర్భ జలంగా నిల్వ అవుతుంది. నీటిని శుద్ధి చేయడంలో కూడా నేల పాత్ర ఉంటుంది. లక్షలాది సూక్ష్మజీవులు, ఇతర జీవులు మట్టిలోనే నివసిస్తాయి. జీవాలు మట్టిని సారవంతంగా ఉంచుతాయి.

నేల ఎదుర్కుంటున్న ప్రమాదాలు

నేల ఎదుర్కుంటున్న ప్రమాదాలలో ప్రధానంగా, పారిశ్రామిక వ్యర్థాలు, రసాయన ఎరువులు, ప్లాస్టిక్ వాడకంతో మట్టిలో కాలుష్యం పెరుగుతోంది. అడవులను కూడా నరికి వేయడంతో నేల ఎర్రబడుతోంది, కోతకు గురవుతోంది. నిరంతరం అదే భూమిలో పంటలు పండించడం వలన నేల సారం కోల్పోతోంది. ఆ భూమి క్షీణించి పంటలు మనం పండించలేని స్థితికి చేరడం ఎడారీకరణకు దారి తీస్తుంది. రసాయన ఎరువులకు బదులుగా సేంద్రియ ఎరువులను ఉపయోగించడం ద్వారా నేల సారాన్ని పెంచడం, పంటల మిగులు భాగాలను మట్టిలో కలపడం. అడవులను పెంపొందించడం, పచ్చదనం ద్వారా నేల ధ్రువ్యతను నియంత్రించడం. నీటిని మన అవసరానికి అనుగుణంగా మాత్రమే ఉపయోగించడం. వర్షపు నీటిని సేకరించి భూగర్భ జలాలను నింపడం. ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాలలో వివిధ కార్యక్షేత్రాల మీద అవగాహన కార్యక్రమాలు, రైతులకు నూతన పద్ధతులపై శిక్షణ ఇవ్వడం. విద్యార్థులకు నేల ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తారు. మన భవిష్యత్ తరాలకు మంచి వాతావరణాన్ని అందించాలంటే, మట్టిని రక్షించడం అత్యంత ముఖ్యం. 'నేలను కాపాడితే జీవితం కాపాడినట్లే' అనే నినాదం ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలి. అందుకే, మనందరం కలిసి నేలను పరిరక్షించేందుకు ముందడుగు వేయాలి.

(నేడు ప్రపంచ నేల దినోత్సవం)

(వ్యాస రచయిత సీనియర్ జర్నలిస్ట్, కాలమిస్ట్)

రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula@gmail.com
9010223917

ADRESS
Editor,
Prathipaksham,
Telugu Daily
8-1-284/OU/521/7/9,
OU Colony,
Shaikpet,
Hyderabad,
Telangana
500008

ఆర్భాటంగా శంకుస్థాపనలు.. ఆరు నెలల్లో పూర్తిచేసే దమ్ముందా?

- సీఎం పర్యటనతో ఒరిగిందేమీ లేదు
- అభివృద్ధి లేకుంటే జాతీయ అవార్డులు ఎలా వచ్చాయి?
- మంత్రి పొన్నం మాటలు ఎక్కువ.. పనులు తక్కువ
- మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్ బాబు ధ్వజం

ప్రతిపక్షం,హుస్నాబాద్, నవంబర్ 4: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హుస్నాబాద్ పర్యటనలో ఆర్భాటంగా శంకుస్థాపనలు చేసిన పనులను ఆరు నెలల్లోగా పూర్తి చేసే దమ్ముందా? అని మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్ బాబు సవాల్ విసిరారు. సీఎం పర్యటనతో నియోజకవర్గ ప్రజలకు ఒరిగేదేమీ లేదని, కేవలం రాజకీయ లబ్ధికోసమే ఈ హడావుడి చేశారని ఎద్దేవా చేశారు. హుస్నాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో బీఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధిని వివరిస్తూనే, ప్రస్తుత ప్రభుత్వ వైఫల్యాలపై నిప్పులు చెరిగారు.

అప్పుడు అడ్డుకుని.. ఇప్పుడు గొప్పలా?

గౌరవెల్లి రిజర్వాయర్ నిర్మాణాన్ని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అడుగడుగునా అడ్డుకున్నది కాంగ్రెస్ పార్టీనేనని సతీష్ బాబు ఆరోపించారు. కేసీఆర్ హయాంలోనే అక్కడ కుర్చీ వేసుకొని మరీ 96 శాతం పనులు పూర్తి చేయించామని, ఒక టీఎంసీ నీటిని నింపిన ఘనత బీఆర్ఎస్‌దేనని గుర్తు చేశారు. రిజర్వాయర్ కాలువల భూసేకరణ, నిర్మాణం కోసం అప్పట్లోనే రూ.200 కోట్లు కేటాయించామన్నారు. ఇప్పుడు కాలువలకు రూ.437 కోట్లు కేటాయించామని గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం.. ఇప్పటి వరకు క్షేత్ర స్థాయిలో తట్టెడు మట్టి కూడా తీయలేదని విమర్శించారు. పీసీసీ అధ్యక్షుడిగా గండిపల్లి ప్రాజెక్టును సందర్శించి, అధికారంలోకి రాగానే పూర్తి చేస్తానని హామీ ఇచ్చిన రేవంత్ రెడ్డి.. రెండేళ్లు గడుస్తున్నా ఆ ఊసే ఎత్తడం లేదని మండిపడ్డారు. 2014కు ముందు, ఆ తర్వాత హుస్నాబాద్ పట్టణ రూపురేఖలు ఎలా మారాయో ప్రజలందరికీ తెలుసన్నారు. ఇక్కడ అభివృద్ధే జరగలేదనడం సీఎం, మంత్రుల విజ్ఞతకే వదిలేస్తున్నానని అన్నారు. అభివృద్ధి జరగకపోతే హుస్నాబాద్ పట్టణానికి పలుమార్లు జాతీయ స్థాయి అవార్డులు ఎలా వచ్చాయో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గంలో మహాసముద్రం గండి, గాడుదులలొద్ది నిర్మాణం, శనిగరం ప్రాజెక్టు, చెరువుల మరమ్మతులు తామే చేశామన్నారు. ఒక డిగ్రీ కళాశాలకు అనుమతులు తెచ్చి, ఏదో ఉద్ధరించినట్లు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు.

కమిషన్ల కక్కుర్తితోనే కూల్చివేతలు

పక్కాగా ఉన్న ప్రభుత్వాసుపత్రి భవనాన్ని కేవలం కమిషన్ల కోసమే కూల్చివేశారని సతీష్ బాబు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. చిత్తశుద్ధి ఉంటే విశాలమైన స్థలంలో మరోచోట కొత్త భవనాన్ని నిర్మించవచ్చని హితవు పలికారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాటలు ఎక్కువ, పనులు తక్కువ అన్న చందంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. విపక్షంలో ఉన్నప్పుడు గౌరవెల్లి నిర్వాసితులకు ఎకరాకు రూ.30 లక్షల పరిహారం ఇప్పిస్తానని నమ్మబలికిన పొన్నం, ఇప్పుడు రూ.15 లక్షలే ఇస్తామనడం హాస్యాస్పదమన్నారు. ఆరు గ్యారంటీలు, 420 హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఆ వైఫల్యాలతో రాబోయే గ్రామపంచాయతీ ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతోనే ముఖ్యమంత్రి జిల్లా పర్యటనలు, బహిరంగ సభలు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. తొమ్మిదిన్నర ఏళ్ల బీఆర్ఎస్ పాలనలో నియోజకవర్గంలో రూ.5,649 కోట్ల అభివృద్ధి పనులు, రూ.3,427 కోట్ల సంక్షేమ ఫలాలను అందించామని సతీష్ బాబు గణాంకాలతో వివరించారు.

ఎల్లమ్మ ఆలయంలో ఘనంగా పౌర్ణమి వేడుకలు

- పంచామృత అభిషేకం, చండీ హోమం
- మహా అన్నదానం నిర్వహించిన బొలిశెట్టి శివయ్య దంపతులు

ప్రతిపక్షం,హుస్నాబాద్, నవంబర్ 4: హుస్నాబాద్ పట్టణంలోని రేణుక ఎల్లమ్మ దేవాలయంలో పౌర్ణమి సందర్భంగా గురువారం ప్రత్యేక పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా దేవాలయ అర్చకులు తాటికొండ పరమేశ్వర్ శర్మ, కొత్తకొండ వీరభద్ర స్వామి దేవాలయ అర్చకులు తాటికొండ వినయ్ శర్మ, నందనం శ్రవణ్ శర్మ, కొండూరి శశాంక్ భరద్వాజ్, నీల కుమార స్వామి ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృత అభిషేకం, కుంకుమ పూజ, చండీ హోమం జరిపారు. సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి పుష్ప,శివయ్య దంపతులు ఈ మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. పవిత్రమైన చండీ హోమంలో ఆకుల వెంకన్నరజిత, పచ్చిమట్ల రవీందర్ గౌడ్, సుమలత, వడ్డేపల్లి సంతోష్,చందన దంపతులు పాల్గొన్నారు.ఈ వేడుకల్లో జిల్లా గ్రంథాలయ చైర్మన్ కేడం లింగమూర్తి, ఏఎంసీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, ఆలయ కార్యనిర్వహణ అధికారి పి. కిషన్ రావు, నాయకులు చిత్తారి రవి పద్మ, దేవాలయ మాజీ చైర్మన్ పూదరి లక్ష్మీనారాయణ గౌడ్, పూదరి శ్రీనివాస్ గౌడ్, చంద్రమౌళి గౌడ్, పూదారి వరప్రసాద్, మరియాల రాజిరెడ్డి, పిల్లి తిరుపతి, పున్నసది వల్లపు రాజు, పున్న హనుమంతు, గీకురు రమేష్, వీర రాజు తదితర భక్తులు, పాల్గొన్నారు.

నాచగిరిలో వైభవంగా దత్త జయంతి

ప్రతిపక్షం, గజ్వేల్(వర్గల్), డిసెంబర్ 4: వర్గల్ మండలం నాచారం గుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో గురువారం దత్త జయంతిని పురస్కరించుకుని దత్తాత్రేయ స్వామి మందిరంలో విశేష అభిషేకాలు, హోమాధి కార్యక్రమాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ రవీందర్ గుప్తా, కార్య నిర్వాహణాధికారి విజయ రామారావు, సహాయాధికారి సుధాకర్, ఆలయ సిబ్బంది తోపాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

త్వరలో సాండ్ బజార్ ప్రారంభం

- సాండ్ బజార్తో ఇసుక అక్రమ రవాణాకు చెక్
- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

ప్రతిపక్షం, మెదక్ టౌన్, డిసెంబర్ 4: మెదక్ పట్టణంలో నూతనంగా నిర్మించబడుతున్న ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలకు త్వరలో ఇసుక సమస్య తీరబోతుందని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ ప్రాంగణంలో సాండ్ బజార్ ను ప్రారంభిస్తున్నట్లు వివరించారు. ఇందిరమ్మ గృహ నిర్మాణాలకు ఇసుక సమస్యను పరిష్కరించడానికి,మంచి చవకైన,నాణ్యమైన ఇసుకను ఇంటి నిర్మాణాలకు అందించడానికి త్వరలోనే సాండ్ బజార్ ప్రారంభిస్తున్నామన్నారు. సాండ్ బజార్లో ఒక మెట్రిక్ టన్ ఇసుక సుమారుగా 1200 రూపాయలకే లభిస్తుందని, నూతనంగా ప్రారంభించుకోబోయే సాండ్ బజార్లో 1000 మెట్రిక్ టన్నుల ఇసుక స్టాక్ ఇప్పటికే వచ్చి ఉన్నట్లు తెలిపారు. సాండ్ బజార్ త్వరగా ప్రారంభించడానికి చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.ఈ సాండ్ బజార్ ఏర్పాటైన తర్వాత ఇసుక అక్రమ రవాణా నిర్మూలించగలం అని తెలిపారు.ఈ కార్యక్రమంలో మైనింగ్ ఏడి.సంజయ్ కుమార్, ఆర్ ఐ. లక్ష్మీనారాయణ, మార్కెట్ కమిటీ అధికారులు ఉన్నారు.

బూరుగుపల్లి 8 మంది వార్డు మెంబర్లు ఏకగ్రీవం

- సర్పంచ్‌స్థానానికి హోరాహోరీ పోరు

ప్రతిపక్షం ప్రతినిధి, -మెదక్, డిసెంబర్ 4: జిల్లా హవేలీ గణపురం మండలంలో మేజర్ గ్రామపంచాయతీ అయిన బూరుగుపల్లి గ్రామంలో రాజకీయ వేడి మొదలైంది. స్థానిక సంస్థల ఎన్నికలు దగ్గర పడ్డ కొద్దీ అభ్యర్థులతో పాటు గ్రామస్థాయి నాయకులు హోరాహోరీ ప్రచారం మొదలుపెట్టారు. గ్రామంలో సర్పంచ్ పదవికి నలుగురు అభ్యర్థులు పోటీలో ఉండగా ఇద్దరు అభ్యర్థులకు తీవ్రమైన పోటీ నెలకొంది. గట్టి పోటీలో ఉన్న ఇద్దరు అభ్యర్థులు విద్యావంతులు కావడంతో తీవ్రమైన పోటీ నెలకొనడం జరిగింది. ఇది ఇలా ఉండగా ఒకటో వార్డు కొలుపుల కృష్ణ, రెండో వార్డ్ ఆబ్బరిబోయిన మంజుల, మూడో వార్డు బందెల బాబు, నాలుగో వార్డ, లంక రాజు, ఐదో వార్డు తొగరి అరవింద్, ఏడో వార్డు కుమ్మరి రుక్కమ్మ, 9వ వార్డు తుమ్మ గళ్ళ లక్ష్మి, 11వ వార్డు ఉప్పరి కళ్యాణి, ఏకగ్రీవం కావడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక పోరుకు సిద్ధమైన అభ్యర్థులు భవిష్యత్తును పరీక్షించే సమయం ఇంకా కొద్ది రోజులు ఉండడంతో గ్రామ ఓటర్లను ప్రసన్నం చేసుకున్న కార్యక్రమంలో అభ్యర్థులు నిమగ్నమయ్యారు.

బీసీ బిడ్డను కిడ్నాప్ చేసిన సందీప్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలి

- బీసీ ఎస్సీ, ఎస్టీ జేఏసీ నాయకులు నవీన్ గౌడ్, బత్తుల చంద్రం డిమాండ్

ప్రతిపక్షం, సిద్దిపేట, డిసెంబర్ 4: నల్లగొండ జిల్లా ఎల్లమ్మగూడ గ్రామం సర్పంచ్ స్థానం జనరల్ స్థానం కావడంతో పోటీలో నిలిచిన యాదవ బిడ్డ ను కిడ్నాప్ చేసి చిత్రహింసలకు గురి చేసిన సందీప్ రెడ్డి అనే వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని బీసీ ఎస్సీ, ఎస్టీ జేఏసీ నాయకులు నవీన్ గౌడ్, బత్తుల చంద్రం డిమాండ్ చేశారు. రాజ్యాంగబద్ధంగా నామినేషన్ వేసిన మామిండ్ల యాదగిరిని తన భార్య నాగలక్ష్మి అనే బీసీ బిడ్డను అగ్రవర్ణ దురాహంకారంతో పోటీ చేయవద్దని హింసించడం సరికాదన్నారు. సిద్దిపేట ప్రెస్ క్లబ్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ, జేఏసీ నాయకులు మీడియాతో మాట్లాడారు. జనరల్ స్థానం అంటే అది ఓసిలకు కాదని ప్రతి ఒక్కరికి పోటీ చేసే హక్కు ఉంటుందని తెలిపారు. ఒక బీసీ వ్యక్తిని కిడ్నాప్ చేసి చిత్రహింసలకు గురిచేసినా, ఇప్పటి వరకు చర్యలు తీసుకోకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ఇప్పటికైనా సందీప్ రెడ్డి తన అనుచరులపై ప్రభుత్వం చర్యలు చేపట్టాలని లేనిపక్షంలో బీసీ, ఎస్సీ, ఎస్టి జేఏసీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీసీ, ఎస్సీ, ఎస్టి జేఏసీ నాయకులు ఐలయ్య, బోయ రాములు, మహేందర్, శ్రీనివాస్ పలువురు పాల్గొన్నారు.

అక్రమంగా ఎస్సీ సర్టిఫికెట్ పొందిన వారిపై చర్యలు తీసుకోవాలి

- న్యాయం జరిగే వరకు ఎన్నికలను బహిష్కరిస్తాం
- ఇబ్రహీంపూర్ గ్రామంలో ఎస్సీ కుల సభ్యుల నిరసన

ప్రతిపక్షం, సిద్దిపేట, డిసెంబర్ 4: అక్రమంగా ఎస్సీ కులం సర్టిఫికేట్ ను పొంది, ఎన్నికల్లో పోటీ చేస్తున్న వారిపై అధికారులు చర్యలు తీసుకొని, తమకు న్యాయం చేయాలని, లేనిపక్షంలో పంచాయితీ ఎన్నికలను తాము బహిష్కరిస్తున్నట్లు ఇబ్రహీంపూర్ గ్రామ ఎస్సీ కులస్తులు తెలిపారు. గురువారం నారాయణరావుపేట మండల పరిధిలోని ఇబ్రహీంపూర్ గ్రామంలో తమకు న్యాయం కావాలంటూ ఎస్సీ కులస్తులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని బీసీ దాసరి కులానికి చెందిన కొందరు వ్యక్తులు తప్పుడు ఆధారాలు చూపి, ఎస్సీ వర్గానికి చెందిన వారిగా కుల ధ్రువీకరణ పత్రాలు పొందారని, వాటిని అడ్డు పెట్టుకుని ప్రస్తుత గ్రామపంచాయతీ ఎన్నికల్లో తమ ఎస్సీ వర్గానికి వచ్చిన రిజర్వేషన్ల వార్డు స్థానాలకు నామినేషన్లు వేశారని అన్నారు. గతంలో వారు బీసీ కులస్తులుగా చెప్పుకుని, బీసీ వార్డు స్థానాలకు పోటీ చేశారని అన్నారు. అర్హులైన తమకు రాజ్యాంగం ఇచ్చిన హక్కులను వినియోగించుకోరాకుండా బీసీ కులానికి చెందిన వ్యక్తులు నామినేషన్ వేయడం సరికాదని, ఈ విషయంపై ఎన్నోసార్లు ఉన్నతాధికారులకు విన్నవించిన ఎలాంటి పరిష్కారం లేదు. ఈ సమస్యను పరిష్కరించకపోతే గ్రామపంచాయతీ ఎన్నికల్లో తమ వర్గం ఎన్నికలను బహిష్కరిస్తామని అన్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దేవయ్య, రోమాల కనకయ్య, కోదూరి చిన్న దేవయ్య, గంగాపురం అశోక్, రోమాల నర్సయ్య, చిన్న నర్సింలు, శ్యాగ సుమన్, లక్ష్మి, సాయవ్వ, పుష్పలత, లత, ఎల్లవ్వ, ప్రమీల, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను పరామర్శించిన బక్కి వెంకటయ్య

ప్రతిపక్షం, దుబ్బాక, డిసెంబర్ 4: దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలోని దుంపలపల్లి వార్డుకు చెందిన మాజీ ఎంపీటీసీ వెంకటస్వామి గౌడ్, రిటైర్డు ప్రభుత్వ ఉపాధ్యాయుడు బాలేషంగౌడ్ల మాతృ మూర్తి సత్తమ్మ(108) ఇటీవల మరణించిన విషయం తెలుసుకుని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య వారి కుటుంబ సభ్యులను పరామర్శించి వారి మాతృ మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థించి నట్టు ఆయన తెలిపారు. ఆయన వెంట నాయకులు బోయ శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్లు ఆస స్వామి, యాదగిరి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బాలకిషన్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ ఏర్పాటు

ప్రతిపక్షం సిద్దిపేట డిసెంబర్ 4: తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ జిల్లా నూతన కమిటీని అధికారికంగా ప్రకటించింది. కమిటీలో గౌరవ అధ్యక్షుడిగా డాక్టర్ పెద్ది రాజు, అధ్యక్షుడిగా సుంచు నరేందర్ నియమితులు. అసోసియేట్ అధ్యక్షుడిగా పి. రాజిరెడ్డిలను ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా చి. నర్సింలు, కె. తిరుపతి, జి. సత్తయ్య, బి. లింగారెడ్డి, జి. భన్సీలాల్, జే. బిక్షపతి, ఎ. తిరుపతి, కే.ఎస్. అనిల్ ఎంపికయ్యారు. ప్రధాన కార్యదర్శి గా దేవులపల్లి కిష్టయ్య, అసోసియేట్ ప్రధాన కార్యదర్శిగా పి. ఎల్లయ్య, కార్యదర్శులుగా పి. మల్లయ్య, జి. జానకి రాములు, ఎం. భైరవ స్వామి, ఎం. పర్శరాములు, జే. రాజిరెడ్డి, ఎం. కృష్ణమూర్తి, చి. బాల్ నర్సయ్య మరియు డి. రమేష్ నియమితులయ్యారు. కొత్త కమిటీ విద్యా పరిరక్షణ కార్యక్రమాలను ముందుకు నడిపించడానికి కృషి చేస్తుందని పేర్కొన్నారు.

మల్లన్న స్వామికి బంగారు ఆభరణాలు విరాళం

ప్రతిపక్షం, కొమురవెల్లి, డిసెంబర్ 4: శ్రీ మల్లికార్జునస్వామి దేవాలయానికి కొమురవెల్లి మండలంలోని గురువాన్నపేటకు చెందిన దాతలు పబ్బోజు శ్రీకాంత్, పబ్బోజు బాలాచారిలు సుమారు 10 గ్రాముల బంగారు ఆభరణాలు విరాళంగా అందజేశారు. గురువారం కొమురవెల్లిలోని మల్లన్న ఆలయంలో ఈవో టంకశాల వెంకటేష్ ఆధ్వర్యంలో దాతలు మల్లికార్జునస్వామికి బంగారు, కోరమీసం, అమ్మ వాళ్లకు బంగారు ముక్కుపుడకలు విరాళంగా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు దాతలకు రసీదు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు మహదేవుని మల్లికార్జున్, ఆలయ పర్యవేక్షకులు నీల శేఖర్, అకౌంటెంట్ శంకర్ తదితరులు ఉన్నారు.

నా భార్యని ఎన్నికల్లో గెలిపిస్తే కటింగ్, షేవింగ్ ఫ్రీ

- గ్రామస్తులకు భర్త -బంపర్ ఆఫర్

ప్రతిపక్షం, దుబ్బాక, డిసెంబర్ 4: తన బార్యను వార్డు సభ్యురాలుగా ఓటు వేసి గెలిపిస్తే.. ఐదు సంవత్సరాలు తమ వార్డు సభ్యులకు కటింగ్. షేవింగ్ ఉచితంగా చేస్తానని ఓ భర్త ప్రకటించాడు. సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం రగోత్తంపల్లి గ్రామానికి చెందిన శివాని శ్రీకాంత్ 6వ వార్డులో పోటీలో ఉన్నారు. వృత్తిరీత్యా వీరు నాయీ బ్రాహ్మణ కుటుంబానికి చెందినవారు. వార్డులో అభివృద్ధి లేకపోవడంతో, వార్డు అభివృద్ధికి ఏదైనా చేయాలనే సంకల్పంతో ఎన్నికల బరిలో ఉన్నామంటూ ఈ యువ జంట చెబుతున్నారు. ఈ సందర్భంగా శ్రీ కాంత్ మాట్లాడుతూ నా భార్యకు ఓటు వేసి గెలిపించాలని, వార్డు సభ్యురాలిగా గెలిపిస్తే ఐదు సంవత్సరాలు మా వార్డు సభ్యులకు(పురుషులకు) కటింగ్, షేవింగ్ ఉచితంగా చేస్తానన్నారు.



ఎన్నికల నిబంధనల ఉల్లంఘన.. 63 మందిపై కేసు నమోదు

ప్రతిపక్షం, అక్బరుపేట, భూంపల్లి, డిసెంబర్ 4: గ్రామ పంచాయితీ ఎన్నికల సందర్భంగా మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులో ఉన్నందున, ఎటువంటి ముందస్తు అనుమతి లేకుండా సమావేశం నిర్వహించి, ఓటర్లను ప్రలోభానికి గురిచేసినందుకు గాను, సిద్దిపేట జిల్లా భూంపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని తాళ్లపల్లి గ్రామంలో మొత్తం 63 మంది వ్యక్తులపై కేసు నమోదు చేయడం జరిగిందని భూంపల్లి ఎస్ఐ హరీష్ తెలిపారు. తాళ్లపల్లి గ్రామంలో కొత్తగా నిర్మిస్తున్న పెద్దమ్మ గుడి వద్ద గ్రామస్తులు కొంతమంది ఒక సమావేశం నిర్వహించినట్లు పోలీసులు గుర్తించారు. గ్రామ పంచాయితీ ఎన్నికలలో ఒకే కులం నుండి సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ వేసిన ఐదుగురు వ్యక్తులలో, ఎవరైతే పెద్దమ్మ గుడి నిర్మాణానికి ఎక్కువ డబ్బులు ఇస్తారో, వారికి వారి కులస్తులు అందరూ ఓటు వేయాలని తీర్మానం చేయడానికి కులపెద్దమనుషులు మాట్లాడుకుంటున్నట్లు తెలియడంతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎన్నికల నిబంధనలు అమలులో ఉన్నప్పటికీ, గ్రామస్తులు ఎటువంటి ముందస్తు అనుమతి తీసుకోకుండా సమావేశం నిర్వహించడం, ఓటు వేయడానికి డబ్బులు ఇవ్వాలనే అంశాన్ని చర్చించి, ఓటర్లను ప్రలోభానికి గురిచేయడం స్పష్టంగా చట్ట వ్యతిరేకం అని సబ్ ఇన్స్పెక్టర్ ఇచ్చిన సమోటో పిటిషన్ పై సమావేశంలో పాల్గొన్న కుల సంఘం పెద్దమనుషులు ఇద్దరు, 5 మంది సర్పంచ్ అభ్యర్థులు , 56 మంది సభ్యులు సహా మొత్తం 63 మందిపై భూంపల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.

“

అభివృద్ధిలో రాజకీయాలకు అతీతంగా పనిచేస్తాం. ఆదిలాబాద్‌కూ ఎయిర్‌పోర్టు కావాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ నాతో అన్నారు. ఇదే విషయం నిన్న ఢిల్లీలో పీఎం మోదీతో మాట్లాడాను. సంవత్సరం తిరిగేలోగా ఆదిలాబాద్‌లో ఎయిర్‌పోర్టు పనులు ప్రారంభిస్తాం. ఎర్రబస్సు రావడమే కష్టమనుకున్న ప్రాంతంలో ఎయిర్‌బస్ తీసుకొచ్చి.. కంపెనీలు నెలకొల్పే బాధ్యత తీసుకుంటున్నా.

- ఆదిలాబాద్‌సభలో సీఎం రేవంత్ రెడ్డి

ప్రాంతీయం

అభివృద్ధి పనులు పరిశీలించిన ఎమ్మెల్యే

ప్రతిపక్షం, గోదావరిఖని, డిసెంబర్ 4: రామగుండం నియోజకవర్గ శాసనసభ్యులు ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ గురువారం నియోజక వర్గంలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు.రామగుండం రైల్వే స్టేషన్ ఎదురుగా జరుగుతున్న షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనుల ను పరిశీలించి,నిర్మాణ నాణ్యత, పురోగతిపై సంబంధిత అధికారుల ను వివరాలు అడిగి తెలుసు కున్నారు. అలాగే రోడ్లు,డ్రైన్లు, ఇతర మౌలిక వసతుల అభివృద్ధి విషయమై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి,పెండింగ్ పనులను వేగవంతం చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు,ప్రజా ప్రతినిధులు,ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎయిర్ పోర్ట్ అథారిటీ అధికారులను కలిసిన ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్

- ఎయిర్ పోర్ట్ సాధ్యాసాధ్యాలపై ఎన్ టీ పి సి జ్యోతి భవన్ లో సమీక్షించిన ఎమ్మెల్యే

ప్రతిపక్షం, గోదావరిఖని, డిసెంబర్ 4: రామగుండం నియోజకవర్గం అంతర్గాం మండల కేంద్రంలో ప్రతిపాదిత విమానాశ్రయం ఏర్పాటు స్థలాన్ని పరిశీలించేందుకు ఢిల్లీ నుంచి ఎయిర్ పోర్ట్ అథారిటీ బృందం గురువారం ఈ ప్రాంతాన్ని వచ్చారు.ఈ సందర్భంగా సంబంధిత అధికారుల బృందాన్ని స్థానిక ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్ మర్యాద పూర్వకం గా కలిశారు.ఎయిర్పోర్ట్ ఏర్పాటు సాధ్యసాధ్యలపై అధికారులతో సమీక్షించారు.అంతర్గాం మండల కేంద్రంలోని ప్రతిపాదిత 977 ఎకరాల స్థలాన్ని అధికారులు పరిశీలించారు. అలాగే ఎల్లంపల్లి గోదావరి నది పరిసరప్రాంతాలను, స్పిన్నింగ్,వీవింగ్ మిల్ తదితర ప్రాంతాలను ప్రత్యేకంగా పరిశీలించారు.అనంతరం రామగుండం ఎన్టీపీసీ విద్యుత్ పరిశ్రమకు చెందిన జ్యోతి భవన్ కు చేరుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారిని మర్యాద పూర్వకంగా కలిశారు.అంతర్గాం లో ఎయిర్పోర్ట్ విషయంలో గతంలో సీఎం రేవంత్ రెడ్డి తో పాటు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులతో సమీక్షించినట్లు తెలిపారు.ఇదే క్రమంలో తప్పనిసరిగా ఈప్రాంతం లో ఎయిర్ పోర్ట్ ఏర్పాటు కు అనువైన స్థలం ఉందని అధికారుల దృష్టికితీసుకువెళ్లారు. అయితే ఇప్పటికే పూర్తిస్థాయిలో ఫిజిబిలిటీ రిపోర్టు తయారు చేస్తున్నామని అనంతరం ఉన్నతా ధికారుల దృష్టికి తీసుకువెళ్తామని ఎమ్మెల్యేతో అధికారులు ప్రస్తావించారు.భవిష్యత్తులో ఎయిర్పోర్టు ఏర్పాటు వల్ల ఉమ్మడి కరీంనగర్ జిల్లాతో పాటు ఆదిలాబాద్ జిల్లా ప్రాంత ప్రజలు, పారిశ్రామిక ప్రాంతాల్లోని అధికారులకు ఎంతగానో ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.తప్పనిసరిగా ఈ ప్రాంతంలో ఎయిర్పోర్ట్ ఏర్పాటు చేసేందుకు రాష్ట్రప్రభుత్వం తరపున పెద్ద ఎత్తున ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ఈ సమావేశంలో పెద్దపల్లి ఆర్డీవో గంగయ్య,అంతర్గం మండల తాసిల్దార్ తూము రవీందర్ పటేల్,జిల్లా ఆఫీసర్స్ మైన్స్, ట్రాన్స్కో, ఎలక్ట్రిసిటీ, ఇరిగేషన్, గ్రౌండ్ వాటర్,ఎన్ టి పి సి, సింగరేణి,బిల్డింగ్ డిపార్ట్మెంట్, ప్లానింగ్ డిపార్ట్మెంట్ ,పోలీస్ డిపార్ట్మెంట్, జిల్లా అధికారులు, మండలల అధికారులు తదితరులు పాల్గొన్నారు

ఎంపీడీఓ కార్యాలయాలు తనిఖీ చేసిన వ్యయ పరిశీలకులు

ప్రతిపక్షం రాజన్న సిరిసిల్ల బోయినపల్లి/ఇల్లంతకుంట, డిసెంబర్ 4: గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా పలు ఎంపీడీఓ కార్యాలయాలను ఎన్నికల జిల్లా వ్యయ పరిశీలకులు రాజ్ కుమార్ గురువారం తనిఖీ చేశారు. బోయినపల్లి, ఇల్లంతకుంట ఎంపీడీఓ కార్యాలయాలను పరిశీలించారు. అక్కడ అధికారులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నోడల్ అధికారి నవీన్, భారతి, ఎంపీడీఓ లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణంలో జరగాలి

- మైక్రో అబ్జర్వర్ల పాత్ర ఎన్నికల్లో కీలకం

ప్రతిపక్షం, వనపర్తి ప్రతినిధి, డిసెంబర్ 4:ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించడంలో మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకమని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. కలెక్టరేట్ లోని సమావేశ మందిరం లో గురువారం మైక్రో అబ్జర్వర్లకు నిర్వహించిన శిక్షణకు ఎన్నికల సాధారణ పరిశీలకులు మల్లయ్య భట్టు, వ్యయ పరిశీలకులు శ్రీనివాస్, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు యాదయ్య తో కలిసి పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికలు స్వేచ్ఛయుత వాతావరణంలో నిర్వహించడంలో మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకమని అన్నారు. మైక్రో అబ్జర్వర్లు పోలింగ్ ప్రక్రియను పరిశీలన చేయడమే కీలకమని, అలాకాకుండా పిఓలు ఏపీఓల విధుల్లో జోక్యం చేసుకోరాదని చెప్పారు. పోలింగ్ ప్రక్రియ ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం జరుగుతుందా లేదా పరిశీలన చేయడం మైక్రో అబ్జర్వర్ల ప్రధాన బాధ్యత అన్నారు. గ్రామపంచాయతీ ఎన్నికల పోలింగ్ నిర్వహణలో ఏమైనా సమస్యలు ఉంటే అబ్జర్వర్లకు తెలియజేయాల్సిన బాధ్యత మైక్రో అబ్జర్వర్లపై ఉంటుందన్నారు.

పోలింగ్ రోజున ఉదయం 6:00 కల్లా మైక్రో అబ్జర్వర్లు నిర్దేశించిన పోలింగ్ కేంద్రానికి చేరుకోవాలని కలెక్టర్ సూచించారు. మైక్రో అబ్జర్వర్లు తాము ఫిల్ చేయాల్సిన చెక్ లిస్ట్ ను చాలా జాగ్రత్తగా పూర్తి చేయాలని సూచించారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికల పోలింగ్ నిర్వహణకు మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకమని పరిశీలకులు తెలియజేశారు.సమావేశంలో లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ శివకుమార్, ట్రైనర్ శ్రీనివాసులు, డిప్యూటీ సీఈఓ రామ మహేశ్వర్, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే మేఘా రెడ్డి

ప్రతిపక్షం, వనపర్తి ప్రతినిధి, డిసెంబర్ 04 :వనపర్తి ఎమ్మెల్యే.తూడి మేఘారెడ్డి గురువారం ఖిల్లా ఘణపురం మండల పరిధిలోని మామిడి మాడ గ్రామంలోని పలువురి బాధిత కుటుంబాలను పరామర్శించారు.ప్రమాదవశాత్తు గాయపడిన బుచ్చన్నను ఆయన పరామర్శించారు.అనంతరం వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.గత నాలుగు రోజుల క్రితం మృతి చెందిన జాన్మియా కుటుంబాన్ని,అనారోగ్యంతో ఇటీవల మృతి చెందిన భారతి కుటుంబాన్ని సైతం ఎమ్మెల్యే. మేఘా రెడ్డి పరామర్శించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు వెంకట్రావు, సాయి చరణ్ రెడ్డి, లింగం, నరసింహారెడ్డి, దానయ్య తదితరులు పాల్గొన్నారు.

నిస్సహాయులకు అండగా నిలబడటమే నాయకుడి లక్ష్యం. తాను గుర్తింపు, పదవుల కోసం పాకులాడలేదు. ప్రజలకు సేవ చేసే ప్రయాణంలో పదవి వస్తే అలంకారం కాదు బాధ్యత అని నమ్ముతా. అదృష్టవశాత్తు తన పేషీలోని అధికారులు కూడా సమాజానికి మంచి చేద్దాం అనే తపన ఉన్నవాళ్లే ఉన్నారు.

\- ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్

అంగరంగ వైభవంగా శ్రీ పడమటి ఆంజనేయస్వామి జాతర

ప్రతిపక్షం ప్రతినిధి, నారాయణపేట్, డిసెంబర్ 4: నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గ కేంద్రంలో వెలసిన శ్రీ పడమటి ఆంజనేయస్వామి వారిని స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర పశుసంవర్ధక క్రీడల శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి దర్శించుకున్నారు. స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఇవాళ జరుగుతున్న రథోత్సవం సందర్భంగా మంత్రి ఇంటి ఇలవేల్పు అయినటువంటి శ్రీ పడమటి ఆంజనేయ స్వామివారికి కుటుంబ సమేతంగా తరలివచ్చి దర్శించుకున్నారు. ముందుగా స్వామివారికి మంత్రి తలనీలాలు సమర్పించి నూతనంగా పునరుద్ధరించబడిన కోనేటిలో పుణ్యస్నానం ఆచరించారు. అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయించి, మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ వంశపార్యపర్య ధర్మకర్త ప్రాణేశాచారి మంత్రిని శాలువాతో ఘనంగా సత్కరించి స్వామివారి చిత్రపటాన్ని అందించారు. అదేవిధంగా తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వచనం చేశారు.

గడ్డం వంశీ కి అభినందనలు.. సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులు

ప్రతిపక్షం, గోదావరిఖని, డిసెంబర్ 4: గురువారం జరుగుతున్న శీతాకాల పార్లమెంట్ సమావేశా ల్లో సింగరేణి విశ్రాంత ఉద్యోగులు నెలకు అతి తక్కువగా వెయ్యి రూపాయల లోపు పెన్షన్ పొందుతున్నారని పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీ వాపోయారు. మాజీ కేంద్ర కార్మిక శాఖ మంత్రి వెంకట స్వామి కృషి వలన ఏర్పడిన కోల్ మైన్స్ పెన్షన్ స్కీం ప్రవేశ పెట్టి 27 సంవత్సరాలు గడిచినను వారి పెన్షన్ లో పెరుగు దల లేదని,పెన్షనర్ల నేటి ప్రాథమిక అవసరాలు తీర్చేందుకు సింగరేణి పెన్షనర్లకు నెలకు కనీస పెన్షన్ రూ.10,000 చెల్లించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం అభినందనీయమని సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉప ప్రధాన కార్యదర్శి ఆళవందార్ వేణు మాధవ్ తెలిపారు

కొనుగోలు కేంద్రాల్లో అదనపు కలెక్టర్ పరిశీలన

ప్రతిపక్షం, వేములవాడ అర్బన్/ బోయినపల్లి, డిసెంబర్ - 4: వేములవాడ అర్బన్ మండలం అనుపురం, బోయినపల్లి మండలం మానువాడలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏ గ్రేడ్ ధాన్యానికి క్వింటాలుకు రూ. 2389, సాధారణ రకానికి రూ. 2369 గా నిర్ణయించిందని తెలిపారు. రైతులు తమ సమీపంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి, మద్దతు ధర పొందాలని సూచించారు. తేమ శాతం వచ్చిన ధాన్యాన్ని కొనుగోలు చేసి, కేటాయించిన రైస్ మిల్లులకు తరలించాలని సూచించారు. కార్యక్రమంలో బోయినపల్లి తహసీల్దార్ నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉంటా.. అభివృద్ధి చేస్తా

- సర్పంచ్ అభ్యర్థి డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి

ప్రతిపక్షం ప్రతినిధి, నారాయణపేట్ డిసెంబర్ 4: నారాయణపేట జిల్లా మక్తల్ మండల్ మద్వార్ గ్రామానికి చెందిన వెంకట్ రెడ్డి తనయుడు గా "సీనియర్ మోస్ట్ లీడర్ సంతోష్ రెడ్డి అల్లుడిగా డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి ఓ సాధారణ మధ్యతరగతి రైతు కుటుంబం ఉన్నంత చదువుకొని డాక్టర్ వృత్తి నిర్వహిస్తూ ప్రజల్లో యువత తో దశాబ్ద కాలంలోనే బలమైన ప్రజాధరణం ఏర్పరచుకున్నారు. నిరంతరం గ్రామ అభివృద్ధి కోసం కృషి చేస్తూ డాక్టర్ వృత్తిలో ఇప్పటిదాకా ఎంతో మంది నిరుపేదలకు ఉచిత వైద్యం అందిస్తూ వస్తున్నారు. గ్రామాల్లో ఏ ఆపద వచ్చినా నేనున్నా అంటూ ముందుకు వస్తున్న వ్యక్తిడాక్టర్ శ్రీనివాస్ రెడ్డి అందుబాటులో ఉంటూ. ప్రజల మన్ననలు పొందడంతో నిస్వార్థ సేవకు నిలువెత్తు రూపమైన మ కుటుంబాన్ని గెలిపించాలి నను సర్పంచ్ గా గెలిపిస్తే నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ. ప్రజాసేవకే పునరంకితమవుతానని పేర్కొన్నారు. ప్రజల



ఆశీస్సులు గ్రామ పెద్దల సహకారంతో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను నిరంతరంగా కొనసాగిస్తానని హామీ ఇస్తున్నారు. గ్రామానికి సేవ చేసే అవకాశాన్ని ఇవ్వండి అభివృద్ధి అంటే ఏంటి పనేలా చూపిస్తా సర్పంచ్ అంటే హోదా కాదు గ్రామానికి సేవ చేసే ఒక బాధ్యత మీ సేవకుల పని చేస్తా అవకాశం ఇవ్వండి అని అన్నారు సర్పంచ్ అభ్యర్థి డాక్టర్ శ్రీనివాసరెడ్డి ప్రజలను వేడుకుంటున్నారు.

పంచాయతీ ఎన్నికలకు పటిష్ట భద్రత

- సీపీ గౌస్ఆలం పర్యవేక్షణ
- నామినేషన్ కేంద్రాలు, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్ల పరిశీలన

ప్రతిపక్షం బ్యూరో,కరీంనగర్, డిసెంబర్ 4 : కరీంనగర్ జిల్లాలో మూడు దశల్లో జరగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికలను శాంతియుతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు పోలీసు కమిషనర్ (సీపీ) గౌష్ ఆలం పటిష్ట భద్రతా చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా, మూడవ విడత నామినేషన్ల స్వీకరణ కేంద్రాల వద్ద మరియు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లను సీపీ గురువారంనాడు స్వయంగా పర్యవేక్షించారు.మూడవ విడత ఎన్నికలు జరగనున్న వీణవంక, జమ్మికుంట, హుజురాబాద్, ఇల్లందుకుంట, సైదాపూర్ మండలాల్లో నిన్నటి నుండి ప్రారంభమైన నామినేషన్ల స్వీకరణ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సీపీ గౌష్ఆలం తెలిపారు. నామినేషన్ల దాఖలు ప్రక్రియ ప్రశాంతంగా సాగేందుకు ఏర్పాట్లను ఆయన తనిఖీ చేశారు. ఎన్నికలు సజావుగా సాగేందుకు వీలుగా, సీపీ పలు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. వీణవంక మండలంలోని చల్లూరు, మామిడాలపల్లి; జమ్మికుంట పరిధిలోని జగ్గయ్యపేట, వల్భాపూర్; ఇల్లందుకుంట మండలంలోని నాగంపేట, టేకుర్తి; హుజూరాబాద్ మండలంలోని పెద్దపాపయ్యపల్లి, చిన్నపాపయ్యపల్లి వంటి పలు గ్రామాల పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. పోలింగ్ రోజు ఈ కేంద్రాల వద్ద అదనపు పోలీసు బలగాలను మోహరించి, పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు స్పష్టం చేశారు.శాంతిభద్రతలకు విఘాతం కలిగించేవారిపై కఠిన చర్యలు: ఎన్నికల నేపథ్యంలో పలువురు రౌడీషీటర్ల ఇళ్లకు స్వయంగా వెళ్లి సీపీ గౌష్ ఆలం హెచ్చరించారు. ఎన్నికల్లో ఎటువంటి శాంతిభద్రతలకు విఘాతం కలిగించకూడదని, సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చినందున, గతంలో నేర చరిత్ర ఉన్న ఎన్నికల నేరస్థులను బైండోవర్ చేస్తున్నట్లు సీపీ తెలిపారు.పోలింగ్ కేంద్రాల పరిసరాలు కవర్ అయ్యేలా సీసీ కెమెరాల ఏర్పాటు చేయాలని అధికారులకు సీపీ సూచించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడానికి అన్ని చర్యలు తీసుకుంటామని హామీ ఇస్తూ, ప్రజలు పోలీసులకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ఈ పర్యవేక్షణలో హుజురాబాద్ ఏసీపీ మాధవి, ఇన్స్పెక్టర్లు లక్ష్మీనారాయణ, కరుణాకర్, రామకృష్ణ, ఎస్సైలు ఆవుల తిరుపతి, క్రాంతికుమార్ లతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

వలస కార్మికుల పిల్లల చదువును ప్రోత్సహిస్తాం

- ఇటుక బట్టీల్లో పిల్లలను బడిలో చేర్పించండి
- జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి
- గట్టుభూత్కూర్ లో ప్రత్యేక తరగతి ప్రారంభం

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, డిసెంబర్ 4: జిల్లాలోని వలస కార్మికుల పిల్లల చదువును ప్రోత్సహిస్తామని, ఇందుకోసం జిల్లాలో ఎంపిక చేసిన పాఠశాలల్లో వారికి ప్రత్యేక తరగతి గదులను నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. గంగాధర మండలం గట్టుభూత్కూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో వలస కార్మికుల పిల్లలకోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన తరగతి గదిని కలెక్టర్ గురువారం ప్రారంభించారు. ఇక్కడ 42 మంది వలస కార్మికుల పిల్లలని గుర్తించి విద్యాబుద్ధులు నేర్పిస్తున్నారు. ఈ సందర్భంగా తరగతి గదిలోని చిన్నారులను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి వివిధ భాషల్లో పలుకరించి చదువు, స్వస్థలం, కుటుంబ సభ్యుల వివరాల వంటివి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వలస కార్మికుల పిల్లలందరినీ గుర్తించి వారికి సమీప పాఠశాలల్లో ప్రత్యేక తరగతి గదిలో విద్యా బోధన

చేస్తున్నామని తెలిపారు. గత ఏడాది సుమారు 500 మంది విద్యార్థులను పాఠశాలలో చేర్చి చదువు చెప్పించామని అన్నారు. ఈ సంవత్సరం కూడా మరిన్ని పాఠశాలల్లో ఈ పిల్లల కోసం ప్రత్యేక తరగతి గదులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పాఠశాలకు వచ్చే పిల్లలందరికీ మధ్యాహ్న భోజనం, పోషకాహారం అందిస్తామని తెలిపారు. ప్రత్యేక మెడికల్ క్యాంపు ల ద్వారా వారి ఆరోగ్యాన్ని పరిరక్షిస్తామని అన్నారు. వలస కార్మికుల పిల్లల కోసం ఏర్పాటు చేసే పాఠశాలల్లో అన్ని రకాల వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఇటుక బట్టీల యజమానులతో మాట్లాడి పాఠశాల వరకు రవాణా సదుపాయం ఉండేలా చూడాలని సూచించారు.

పూర్వ ప్రాథమిక పాఠశాల సందర్శన

విద్యాశాఖ ఆధ్వర్యంలో గట్టుబూత్కూరు మండల ప్రాథమిక పాఠశాలలోని పూర్వ ప్రాథమిక పాఠశాలను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సందర్శించారు. ఇక్కడ పూర్వ ప్రాథమిక విద్య అభ్యసిస్తున్న పిల్లలతో మమేకమయ్యారు. ఆటపాటలతో కూడిన విద్యను అందించాలని, ఇందుకోసం ప్రభుత్వం నుండి వచ్చిన అన్ని ఆట వస్తువులను, పుస్తకాలను వినియోగించాలని సూచించారు. పూర్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల నమోదు, హాజరు శాతం పెంచాలని అన్నారు కలెక్టర్ వెంట తహసిల్దార్ రజిత, మండల విద్యాధికారి ఏనుగు ప్రభాకర్ రావు తదితరులు ఉన్నారు.

ఇండియా చేరుకున్న పుతిన్

- ఘనంగా స్వాగతం పలికిన ప్రధాని మోడీ

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, డిసెంబర్ 4: భారత్‌లో రెండు రోజుల పర్యటన కోసం రష్యా అధ్యక్షుడు వ్లాదిమిన్ పుతిన్ ఢిల్లీకి చేరుకున్నారు. పాలం ఎయిర్‌పోర్ట్‌కు పుతిన్ విమానం చేరుకుంది. ప్రధాని నరేంద్ర మోదీ ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పుతిన్, మోదీ ఆత్మీయ ఆలింగనం చేసుకున్నారు. విమానాశ్రయంలో కళాకారుల నృత్యాలతో సంప్రదాయ స్వాగతం పలికారు. పుతిన్, ప్రధాని మోదీ ఇద్దరు ద్వైపాక్షిక అంశాలపై చర్చించనున్నారు. పుతిన్‌కు గౌరవార్థం గురువారం రాత్రి ప్రధాని విందు ఇవ్వనున్నారు. రేపు ఉదయం 11 గంటలకు రాష్ట్రపతి భవన్‌లో అధికారిక స్వాగతం పలుకున్నారు. అలాగే, 23వ భారత్‌రష్యా వార్షిక శిఖరాగ్ర సమావేశంలో పుతిన్ పాల్గొంటారు. ఈ సందర్భంగా అణువిద్యుత్ సహా పలు రంగాల్లో రెండుదేశాల మధ్య కీలక ఒప్పందాలు జరుగనున్నాయి. అంతకు ముందు కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డా.. రష్యా ఆరోగ్యమంత్రి మిఖాయిల్ మురాష్కోతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆరోగ్య రంగానికి సంబంధించిన అంశాలపై చర్చించారు. ఆరోగ్యరంగంలో ద్వైపాక్షిక సహకారం, భాగస్వామ్యాన్ని పెంపొందించుకునేందుకు అంగీకరించారు. రష్యా ఉక్రెయిన్ యుద్ధం తర్వాత పుతిన్ భారత్‌కు రావడం ఇదే తొలిసారి. భారత్‌రష్యా 23వ వార్షిక శిఖరాగ్ర భేటీలో భాగంగా మోదీతో సమావేశమవుతారు. ఇంధనం, పరిశ్రమలు, అంతరిక్షం, వ్యవసాయం తదితర రంగాల్లో ప్రాజెక్టులు పూర్తి చేసుకోవడమే లక్ష్యంగా ఇరుదేశాలు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. భారత్ నుంచి దిగుమతులు మరింత పెంచుకునే అంశంపై సైతం చర్చించనున్నట్లు పేర్కొన్నారు. అధ్యక్షుడు పుతిన్ వ్యాపారవేత్తలతో కలిసి పర్యటిస్తున్నారు. భారత్.. రష్యాతో తన వాణిజ్య లోటును మెరుగుపరచుకోవాలని ఆశిస్తోంది. దాంతో భారత్ ఉత్పత్తులకు భారీ మార్కెట్ ఏర్పడనున్నది.



విశ్వ వీక్షణం

హెచ్1 బీ వీసా దరఖాస్తులకు కొత్త నిబంధన

- సోషల్ మీడియా ఖాతా 'పబ్లిక్' చేయాలి

అమెరికాలో ఉద్యోగం చేయడానికి హెచ్ 1బీ వీసా కోసం దరఖాస్తు చేసుకొనే వారు ఇకపై తమ సామాజిక మాధ్యమాల ఖాతాలను బహిరంగపరచాలంటూ ట్రంప్ ప్రభుత్వం ఓ కొత్త నిబంధనను ప్రకటించింది. ఈ నిబంధన ఈ నెల 15 నుంచి అమలులోకి రానుంది. ఈ నిబంధనను ఇప్పటికే విద్యార్థులు, ఇతర పర్యాటకులకు అమలు చేస్తున్నారు. తాజాగా హెచ్ 1బీ, హెచ్4 వీసాలకు దరఖాస్తు చేసుకొనే వారికి కూడా వర్తింపజేయనున్నారు. చాలామంది తమ సోషల్ మీడియా ఖాతాలలో వ్యక్తిగత వివరాలను అందరికీ అందుబాటులో ఉంచకుండా 'ప్రైవేట్' అనే ఆప్షన్‌ను ఎంచుకుంటారు. ఆ ఆప్షన్‌ను 'పబ్లిక్'గా మార్చాలని, తమ వ్యక్తిగత వివరాలను అందరికీ అందుబాటులో ఉంచాలని అమెరికా ప్రభుత్వం పేర్కొంది. హెచ్ 1బీ, హెచ్ 4 వీసాలకు ఈ నిబంధన వర్తిస్తుంది.

"'పక్కింటి విశ్వని చూడు.. ఉదయం ఐదున్నరకే లేసి బాస్కెట్ బాల్‌కి వెళ్లిపోతాడు. నువ్వు ఉదయం తొమ్మిదైనా నిద్రలేవవు. సెలవులు నీకేనా, ఎవరికీ లేవా?' అంటూ పన్నెండేళ్ల ఆయుష్‌కి తండ్రి మేలుకొలుపు.

'సోనాకు 9.8 మార్కులు వచ్చాయి. నీకూ వచ్చాయి 8.3.. అవీ ఓ మార్కులేనా.. ఎప్పుడు నేర్చుకుంటావు?' అని వైష్ణవికి తల్లి మందలింపు..

మరొకరితో పోలిక వద్దు..

ఇవి ప్రతీ ఇంట్లో సర్వ సాధారణమే.. కానీ ఈ పోలికల వల్ల పిల్లల్లో పోటీ, కసి, అసూయ, ద్వేషం.. ఇలా రకరకాల భావాలు వచ్చేస్తాయి. పోలిక వల్ల మంచి కంటే చెడే ఎక్కువ జరుగుతుంది. దీంతో వారు తల్లిదండ్రులతో పాటు పోల్చిన వారితో కూడా మాట్లాడటం మానేస్తారు. ఫలితంగా పిల్లల్లో ఇన్ఫీరియారిటీ కాంప్లెక్స్ మొదలవుతుంది. తోటిపిల్లలతో మన పిల్లల ఆకలి, నిద్ర, ఏడుపు, నడక, వస్త్రధారణ, హుషారుగా ఉండటం, మార్కులు, ర్యాంకులు.. ఇలా ఎన్నో వాటిని పోలుస్తాం. పక్కింటివారు ఎంబీబీఎస్ సీటు తెచ్చుకుంటే.. ఇక మన కడుపులో బాధ మొదలవుతుంది. దాన్ని మన పిల్లలమీద రుద్దేస్తాం.. 'నువ్వు ఎప్పుడు తెచ్చుకుంటావు?' అంటూ పోరుపెడతాం.. ఫలితంగా ఆ పిల్లలు మానసిక కుంగుబాటుకు గురవుతారు.

- పిల్లలను తరచుగా ఇతర పిల్లలతో పోల్చడం వల్ల వారిలో ఆత్మన్యూనత పెరిగిపోతుంది.
- ఈ స్థితిలో పిల్లలు స్వతంత్రంగా ఏదైనా చేయాలని అనుకోరు. వారిలో ఆత్మవిశ్వాసం కొరవడుతుంది. తాము ఎందుకూ పనికిరాం అనే స్థితికి చేరుకుంటారు. ఫలితంగా వారిలో ఉన్న సామర్థ్యం తగ్గిపోతుంది.
- చదవగలిగే సామర్థ్యం ఉండి చదవలేకపోతే సరే కానీ.. చిన్నప్పటి నుండీ వాళ్ల సామర్థ్యం అంతే అయినప్పుడు వారిపై ఎంత ఒత్తిడి తెచ్చినా కూడా ఆశించిన ఫలితం రాదు. పైగా ఒత్తిడి వల్ల పిల్లలు మానసికంగా కుంగిపోతారు. అక్కడే ఆగిపోతారు.
- తమకు తాము తక్కువ అనుకుంటూ నలుగురిలోకి రావడానికి ఇష్టపడరు. తమలో ఏదో లోపం ఉందనుకుంటారు. ఇలా తమ ఆలోచనల్ని, తమ బాధను ఎవరితోనూ చెప్పుకోలేక ఒంటరితనానికి గురవుతారు. ఫలితంగా ఏదో ఒక తప్పుదారిని ఎంచుకుంటారు.
- ర్యాంకులు రాలేదని పిల్లలను పోగొట్టుకోలేము కదా.. అందుకని పిల్లల మనసుల్ని బాధపెట్టకుండా వారితో ఎంతో ప్రేమగా ఉండాలి.
- పిల్లలకు ఓటమి ఎదురైనప్పుడు వారికంటే ముందు తల్లిదండ్రులు బాధపడిపోయి పిల్లలపై అరవకుండా.. పిల్లలకు ఓదార్పునిస్తే వారు ధైర్యంగా విజయం కోసం పోరాడతారు.
- పిల్లల మధ్య ఎప్పుడూ ఆరోగ్యకరమైన పోటీ ఉండాలి కానీ.. పోలిక ఉండకూడదు. బదులుగా వాళ్లలో స్ఫూర్తిని రగల్చాలి. ఇలా సాధ్యం కావాలంటే.. అవతలి వాళ్ల ప్రత్యేకతల గురించి చెబుతూనే కలిగే లాభాల్ని వివరించగలగాలి.
- ఫలానా ర్యాంకు తెచ్చుకున్నారు, ఫలానా అవార్డు గెల్చుకున్నారు అని చెప్పే బదులు.. అవి రావడానికి వారెంత కష్టపడ్డారో తేలికైన మాటలతో తెలియజెప్పాలి. ఇలా చెప్పడం వల్ల పిల్లలు అవతలి వ్యక్తులపై ద్వేషం పెంచుకోకుండా వారిని రోల్ మోడల్‌గా తీసుకుంటారు. అమ్మానాన్నలపై కూడా కోపం తెచ్చుకోరు.
- పిల్లలపై ఊరికే అరవకుండా వారిలో స్ఫూర్తినింపేలా, నెమ్మదిగా మాట్లాడాలి. వారిలో ఆత్మవిశ్వాసం పెంపొందేలా చేయాలి. భయం పోగొట్టాలి. కష్టపడే తత్వాన్ని పెంపొందించాలి.
- ఇతరుల ఎదుట పిల్లల్లోని సామర్థ్యాన్ని ప్రోత్సహించి మాట్లాడితే వాళ్లలో మరింత కృషి చేయాలనే హుషారు వస్తుంది. అంతేకాని పిల్లల్ని తక్కువచేసి మాట్లాడితే వాళ్లు అవమానంగా భావిస్తారు.
- పిల్లలు ఏం చెప్పినా తల్లిదండ్రులు సానుకూల దృక్పథంతో ఉండాలి.
- పిల్లలు ఉన్నతస్థానాలను చేరుకోవాలని కోరుకోవడంలో నిజాయితీ ఉండాలి తప్ప, ఇతరులను అనుసరించి అడుగులు వేయించాలని అనుకోకూడదు.
- చదువు, ఆటపాటలు ఏవైనా సరే.. వారి అభిరుచికే అధిక ప్రాధాన్యం ఇవ్వాలి తప్ప తోటివారు ఏదో చేస్తున్నారని, పిల్లలను కూడా అదే ఎంచుకోమని ఒత్తిడి చేయకూడదు. వారి అభిరుచికి తగ్గ రంగాన్ని ఎంచుకున్నప్పుడు వారు సంతోషంగా ఆ రంగంలో రాణిస్తారు.

సుఖోయ్-57యుద్ధ విమానాల ఉత్పత్తిపై కీలక ఒప్పందం

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, డిసెంబర్ 3: రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ న్యూఢిల్లీ చేరుకున్నారు. భారత్‌పై అమెరికా అదనపు సుంకాలు విధించిన నేపథ్యంలో ఈ పర్యటన చోటుచేసుకోవడం గమనార్హం. 2021లో పుతిన్ చివరిసారి ఇండియాను విజిట్ చేశారు. పుతిన్ రాక సందర్భంగా రక్షణ, అంతరిక్ష, ఆర్థిక రంగాల్లో రెండు దేశాల మధ్య సహకారం జరగనున్నది. సుమారు 100 బిలియన్ల వాణిజ్య ఒప్పందాలు కుదిరే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. డిఫెన్స్ రంగం అత్యంత కీలకంగా మారనున్నది. సుఖోయ్57యుద్ధ విమానం ఉత్పత్తిపై రెండు దేశాల ప్రకటన చేసే అవకాశాలు ఉన్నాయి. సంయుక్తంగా ఆ యుద్ధ విమానాన్ని ఉత్పత్తి చేసే అవకాశాలుఉన్నాయి. పుతిన్ ఎజెండాలో ఈ అంశమే టాప్‌గా నిలుస్తుందని భావిస్తున్నారు. నేవీ, ఎయిర్, మిస్సైల్ రంగాల్లో సైనిక సహకారం, టెక్నాలజీ బదిలీ చర్చించనున్నారు. ఇవాళ రాత్రికి ప్రధాని మోదీతో కలిసి పుతిన్ డిన్నర్ చేయనున్నారు. రష్యా దిగువ సభ దుమా కూడా సైనిక ఒప్పందానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. గతంలోనూ రష్యా డిఫెన్స్ కంపెనీలతో కలిసి భారత కంపెనీలు పని చేశాయి. ఫిఫ్త్ జనరేషన్ సుఖోయ్57 యుద్ధ విమానాల ఉత్పత్తిపై కీలక ఒప్పందం జరిగే అవకాశం ఉన్నట్లు రష్యా అంబాసిడర్ డెన్నిస్ అలిపోవ్ తెలిపారు. అంతరిక్ష రంగంలోనూ రష్యాసహకారాన్ని భారత్ తీసుకోనున్నది. రాకెట్ల ఇంజిన్ నిర్మాణం, రాకెట్ ఫ్యూయల్, పైలట్ స్పేస్‌ఫ్లయిట్, ఆర్బిటాస్ స్టేషన్స్ అంశంలోనూ రష్యా అంతరిక్ష సంస్థ రాస్‌కోస్మాస్ నుంచి ఇండియా డీల్ కుదుర్చుకునే అవకాశాలు ఉన్నాయి.

మాజీ గవర్నర్, సుష్మా స్వరాజ్ భర్త స్వరాజ్‌కౌశల్ కన్నుమూత

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, డిసెంబర్ 4: సీనియర్ న్యాయవాది, మిజోరం మాజీ గవర్నర్, దివంగత సుష్మా స్వరాజ్ భర్త స్వరాజ్ కౌశల్ గురువారం కన్నుమూశారు. ఆయన వయస్సు 73 ఏళ్లు. పలువురు నేతలు ఆయన అంత్యక్రియల్లో పాల్గొని నివాళి అర్పించారు. కుమార్తె, బీజేపీ ఎంపీ బన్సూరి స్వరాజ్ సోషల్ మీడియా పోస్ట్‌లో తన తండ్రికి నివాళి అర్పించారు. 'మీ ఆప్యాయత, క్రమశిక్షణ, సరళత, మీ దేశభక్తి, అపరిమితమైన ఓర్పు నా జీవితానికి వెలుగు. అవి ఎప్పటికీ మసకబారవు. మీ నిష్క్రమణ నన్నెంతో బాధిస్తున్నది. దేవుని సన్నిధిలో శాంతియుతంగా ఉన్న తల్లితో మీరు తిరిగి కలిశారని నా మనస్సు నమ్ముతున్నది' అని పేర్కొన్నారు. కాగా,1952 జూలై 12న హిమాచల్ ప్రదేశ్‌లోని సోలన్‌లో స్వరాజ్ కౌశల్ జన్మించారు. ఢిల్లీ, చండీగఢ్‌లో చదువుకున్నారు. ప్రముఖ క్రిమినల్ న్యాయవాది అయిన ఆయన 197577 అత్యవసర పరిస్థితి సమయంలో బరోడా డైనమైట్ కేసు విచారణలో సోషలిస్ట్ నేత జార్జ్ ఫెర్నాండెజ్ తరపున వాదించడం ద్వారా తనకంటూ ఒక పేరు తెచ్చుకున్నారు. 1986లో మిజోరం శాంతి ఒప్పందంపై సంతకం చేయడంలో కీలక పాత్ర పోషించారు. 20 సంవత్సరాల తిరుగుబాటును ముగించారు. 1987లో మిజోరం తొలి అడ్వకేట్ జనరల్‌గా నియమితులయ్యారు. 199093 మధ్య మిజోరం గవర్నర్‌గా పనిచేశారు. మరోవైపు 19982004 మధ్య హర్యానా రాష్ట్రానికి పార్లమెంట్‌లో ప్రాతినిధ్యం వహించారు. హర్యానా వికాస్ పార్టీ నేత అయిన ఆయన 199899, 20002004 వరకు రాజ్యసభ సభ్యుడిగా ఉన్నారు. కాగా, 1975లో సుష్మాను స్వరాజ్ కౌశల్ వివాహం చేసుకున్నారు. అయితే 2019 ఆగస్ట్ 6న గుండెపోటుతో ఆమె మరణించారు. వారి ఏకైక కుమార్తె బన్సూరి స్వరాజ్. న్యూఢిల్లీ నియోజకవర్గం నుంచి బీజేపీ లోక్‌సభ సభ్యురాలిగా ఆమె ఉన్నారు.

ఓపెన్ పోర్స్‌ని కవర్ చేద్దాం!

చర్మం మృదువుగా, ప్రకాశవంతంగా ఉండాలని కోరుకోని అమ్మాయి ఉండదు. అయితే, చాలామంది అమ్మాయిలు ముఖంపై ఓపెన్ పోర్స్ కారణంగా ఇబ్బందిపడుతూ ఉంటారు. సెబమ్ ఎక్కువగా ఉత్పత్తి కావడం, జన్యుపరమైన కారణాలు, వృద్ధాప్యం వంటి కారణాల వల్ల చర్మం ఉపరితలంపై ఓపెనింగ్స్ పెద్దవి కావచ్చు. ఓపెన్ పోర్స్ కారణంగా మొటిమలు, వైట్ హెట్స్, బ్లాక్‌హెడ్స్, బ్రెక్ అవుట్స్ వంటి సమస్యలు ఎదురవుతాయి. ఓపెన్ పోర్స్‌ను పూర్తిగా తగ్గించలేనప్పటికీ.. వీటిని కవర్ చేయడానికి కొన్ని ఎఫెక్టివ్ హోం రెమిడీస్ సహాయపడతాయి.

ఓట్స్

ఓట్స్ చర్మపు చికాకు, దురదను తగ్గిస్తాయి. ఇవి ఓపెన్ పోర్స్‌ను తగ్గించడానికి సహాయపడతాయి. ఓట్స్‌ను మెత్తగా పొడి చేసి, దానిలో నీళ్లు, తేనె వేసి పేస్ట్‌లా కలపాలి. ఈ పేస్ట్‌ను ముఖానికి ప్యాక్‌లా అప్లై చేయాలి. అరగంట తర్వాత, గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలి. ఆ తర్వాత ముఖానికి మాయిశ్చరైజర్ అప్లై చేసుకోవాలి.

ముల్తానీ మట్టి





ముల్తానీ మట్టి ఓపెన్ పోర్స్‌ను కవర్ చేయడానికి ప్రభావవంతంగా పనిచేస్తుంది. ఇది చికాకు, చర్మం ఎర్రబడటం వంటి సమస్యల నుంచి ఉపశమనాన్ని అందిస్తుంది. ఇందులోని సహజ శీతలీకరణ గుణాలు చర్మాన్ని శాంతపరుస్తాయి.. చర్మంలోని అధిక నూనెను గ్రహిస్తుంది.. పేరుకున్న మలినాలను తొలగిస్తుంది.. మీరు ఓపెన్ పోర్స్ కారణంగా ఇబ్బంది పడుతుంటే.. ముల్తానీ మట్టిలో రోజ్ వాటర్ కలిపి మృదువైన పేస్ట్‌లా తయారు చేసుకోవాలి. ఈ పేస్ట్‌ను ముఖానికి ప్యాక్‌లా అప్లై చేసుకోవాలి. దీన్ని 20 నిమిషాల పాటు ఆరనిచ్చి, చల్లని నీళ్లతో శుభ్రం చేసుకోవాలి. రోజ్ వాటర్ అందుబాటులో లేకుంటే, పెరుగు, టమాటా రసం కూడా ఉపయోగించవచ్చు. వారానికి రెండు సార్లు ఇలా చేస్తే.. ఓపెన్ పోర్స్ కవర్ అవుతాయి.

శనగపిండి

శనగ పిండి దశాబ్దాలుగా సౌందర్య ప్రయోజనాలకు ప్రసిద్ధి చెందింది. ఇది అద్భుతమైన ఎక్స్‌ఫోలియంట్, క్లెన్సర్‌గా పని చేస్తుంది. చర్మం నుంచి అదనపు నూనెను సమర్థవంతంగా తొలగిస్తుంది. శనగపిండిలో పెరుగు, ఆలివ్ నూనెతో మిక్స్ చేయాలి. ఈ పేస్ట్‌ను ముఖానికి పట్టించి, వృత్తాకారంలో సున్నితంగా మసాజ్ చేయండి. ఆ తర్వాత 20 నిమిషాల పాటు ఆరనిచ్చి, ఆపై నీటితో శుభ్రం చేసుకోవాలి. ఫేస్ ప్యాక్‌ని తీసివేసిన తర్వాత ముఖంపై కొన్ని ఐస్ క్యూబ్‌లను సున్నితంగా రుద్దాలి.

ఐస్‌క్యూబ్స్

ఓపెన్ పోర్స్ తగ్గించడానికి ఐస్ క్యూబ్స్ ఎఫెక్టివ్‌గా పనిచేస్తాయి. శుభ్రమైన క్లాత్ తీసుకుని దానిలో ఐస్ క్యూబ్ వేసి చుట్టాలి. వీటితో 15 నుంచి 30 సెకన్ల పాటు సున్నితంగా రుద్దాలి. చల్లని ఉష్ణోగ్రత వల్ల రక్త నాళాలను సంకోచిస్తాయి. చర్మాన్ని బిగుతుగా చేస్తుంది. తద్వారా ఓపెన్‌పోర్స్ చిన్నవిగా కనిపిస్తాయి. ఇది చర్మానికి రిఫ్రెష్, టోనింగ్ ప్రభావాన్ని అందిస్తుంది.

టోల్ గేట్ల వద్ద ఆగనవసరం లేదు

- ఏడాదిలోగా కొత్త విధానం.. పార్లమెంటుకు తెలిపిన గడ్కరీ

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, డిసెంబర్ 4: హైవేలపై టోల్‌ను వసూలు చేసేందుకు అనుసరిస్తున్న ప్రస్తుత విధానం ఓ ఏడాదిలో ముగుస్తుందని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ చెప్పారు. దీని స్థానంలో ఎలక్ట్రానిక్ విధానం ఓ ఏడాదిలోగా అమల్లోకి వస్తుందన్నారు. ఈ కొత్త విధానాన్ని ఇప్పటికే 10 చోట్ల ప్రారంభించినట్లు తెలిపారు. దీనిని దేశవ్యాప్తంగా విస్తరిస్తామని చెప్పారు. లోక్ సభలో ప్రశ్నోత్తరాల సమయంలో గడ్కరీ గురువారం ఈ వివరాలను వెల్లడించారు. నూతన విధానం అమల్లోకి వస్తే హైవేలపై టోల్ కోసం వాహనాలను ఆపేవారు ఉండరని తెలిపారు. ఇటీవల విడుదలైన అధికారిక ప్రకటన ప్రకారం, నేషనల్ ఎలక్ట్రానిక్ టోల్ కలెక్షన్ ప్రోగ్రామ్‌ను నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా అభివృద్ధి చేసింది. మన దేశంలోని హైవేలపై టోల్ వసూళ్లను క్రమబద్ధీకరించేందుకు ఇది ఉపయోగపడుతుంది.

మూడో వన్డే కోసం..

వైజాగ్ చేరుకున్న టీమిండియా

రాయ్‌పూర్ వన్డేలో కంగుతిన్న భారత జట్టు మూడో వన్డే కోసం వైజాగ్ చేరుకుంది. కెప్టెన్ కేఎల్ రాహుల్ బృందం గురువారం విశాఖ నగరంలో అడుగుపెట్టింది. విమానాశ్రయంలో టీమిండియా ఆటగాళ్లకు ఘన స్వాగతం లభించింది. సిరీస్ ఫలితాన్ని నిర్ణయించే మ్యాచ్ కావడంతో భారత క్రికెటర్లు శుక్రవారం నెట్స్ సెషన్‌లో చెమటోడ్చనున్నారు. శనివారం స్థానిక ఏసీఏవీడీసీఏలో ఉత్కంఠ పోరు అభిమానులను అలరించనుంది. మూడు వన్డేల సిరీస్‌లో చివరి మ్యాచ్ కోసం భారత్, దక్షిణాఫ్రికా జట్లు వైజాగ్ చేరుకున్నాయి. చెరొక మ్యాచ్ గెలుపొందడంతో సిరీస్ పట్టేసేది ఎవరు? అనే ఉత్కంఠ నెలకొంది. తొలి రెండు వన్డేల్లో భారీ స్కోర్లు నమోదవ్వడంతో వైజాగ్ వికెట్ ఎలా ఉండనుంది? అనేది ఆసక్తి రేపుతోంది. గత రికార్డులు చూస్తే.. ఈ స్టేడియంలో అత్యధిక స్కోర్ కొట్టింది భారత జట్టే. 2007 ఫిబ్రవరి 17న శ్రీలంకతో జరిగిన మ్యాచ్‌లో 7 వికెట్ల నష్టానికి 354 పరుగులు చేసింది టీమిండియా. రోహిత్ శర్మ 148తో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. రెండో అత్యధిక స్కోర్..351/4. మూడో అత్యధికం.. 350/6. సో.. గత రెండు మ్యాచుల్లో మాదిరిగానే మూడో వన్డేలోనూ 350 ప్లస్ స్కోర్ ఖాయమనిపిస్తోంది. టెస్టు సిరీస్‌లో వైట్‌వాష్ అయిన భారత జట్టు వన్డే సిరీస్‌ను విజయంతో ఆరంభించింది. రాంచీ వన్డేలో విరాట్ కోహ్లీ 52వ సెంచరీతో కదం తొక్కగా .. రోహిత్ శర్మ, కెప్టెన్ రాహుల్ అర్ధ శతకాలతో మెరిసి భారీస్కోర్ అందించారు. ఆఖర్లో దంచేసినా.. ఉత్కంఠ పోరులో 17 పరుగుల తేడాతో టీమిండియా విక్టరీ కొట్టింది.

ఆస్ట్రేలియా గడ్డపై నెరవేరిన 'రూట్' సెంచరీ కల

- తొలి రోజు ఇంగ్లండ్ 325/9.. స్టార్క్‌కు 6 వికెట్లు

పిచ్ ఏదైనా, ప్రత్యర్థి జట్టులో ఎంతటి పటిష్టమైన బౌలింగ్ దళమున్నా, వాతావరణ పరిస్థితులెలా ఉన్నా బరిలోకి దిగాడంటే భారీ స్కోర్లు బాదుతూ మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ అత్యధిక పరుగుల (టెస్టుల్లో) రికార్డులకు గురిపెట్టిన ఇంగ్లండ్ దిగ్గజ బ్యాటర్ జో రూట్.. ఎట్టకేలకు తన కలను నెరవేర్చుకున్నాడు. ఆస్ట్రేలియా గడ్డపై సెంచరీ చేయాలన్న అతడి చిరకాల వాంఛ గురువారం తీరింది. సుమారు పుష్కరకాలం (2013 నుంచి 15 టెస్టులాడి) పాటు 30 టెస్టు ఇన్నింగ్స్‌లో కంగారూల గడ్డపై మూడంకెల స్కోరు చేయలేక ఆపసోపాలు పడ్డ రూట్ (202 బంతుల్లో 135 నాటౌట్, 15 ఫోర్లు, 1 సిక్స్).. బ్రిస్బేన్ వేదికగా గురువారం మొదలైన డే అండ్ నైట్ టెస్టులో తన ముచ్చట తీర్చుకున్నాడు. రూట్‌తో పాటు ఓపెనర్ జాక్ క్రాలీ (93 బంతుల్లో 76, 11 ఫోర్లు) రాణించడంతో తొలి రోజు ఆట ముగిసే సమయానికి ఆ జట్టు 74 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 325 పరుగులు చేసి మెరుగైన స్థితిలో నిలిచింది. ఆసీస్ వెటరన్ పేసర్ మిచెల్ స్టార్క్ (6/71) మరోసారి చెలరేగి ఇంగ్లండ్ టాప్, లోయరార్డర్‌ను కకావికలం చేశాడు. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న ఇంగ్లండ్‌కు స్కోరుబోర్డుపై పట్టుమని పది పరుగులు కూడా చేరకముందే డకెట్, పోప్ సున్నాలు చుట్టి పెవిలియన్ చేరారు. పింక్ బాల్‌తో స్టార్క్ ఆరంభంలో నిప్పులు చెరగడంతో ఇంగ్లండ్‌కు మరోసారి కష్టాలు తప్పవనే అనిపించింది. కానీ క్రాలీ, రూట్ మాత్రం ఆసీస్ పేసర్లను సమర్థవంతంగా ఎదుర్కొన్నారు. క్రాలీ తన శైలికి తగ్గట్టు దూకుడుగా రన్స్ రాబట్టినా రూట్ నిలకడగా ఆడుతూ స్కోరుబోర్డును ముందుకు నడిపించాడు. ఒకపక్క వికెట్లు పడుతున్నా క్రీజులో పట్టుదలగా నిలిచిన రూట్.. డాగెట్ ఓవర్లో రెండు బౌండరీలతో శతకానికి చేరువయ్యాడు. బొలాండ్ వేసిన 66వ ఓవర్లో బంతిని బౌండరీకి తరలించిన అతడు.. కంగారూల గడ్డపై తొలి శతకాన్ని ఓవరాల్‌గా తన కెరీర్‌లో 40వ సెంచరీని నమోదుచేశాడు. ఆఖర్లో జోఫ్రా ఆర్చర్ (26 బంతుల్లో 32*) అండతో బజ్ బాల్ మోడ్‌లోకి వచ్చేసిన రూట్.. ఇంగ్లండ్ స్కోరును 300 దాటించడమే గాక ఆ జట్టును పటిష్ట స్థితిలో నిలిపాడు.

వెస్టిండీస్ స్పిన్నర్ అరుదైన ఘనత

వెస్టిండిస్ స్పిన్నర్ సునీల్ నరైన్ టీ20 ఫార్మాట్‌లో అరుదైన ఘనత సాధించాడు. జాతీయ జట్టు నుంచి తప్పుకున్నా పూర్తిగా ఫ్రాంచైజీ క్రికెట్ మాత్రమే ఆడుతున్న నరైన్.. ఈ ఫార్మాట్‌లో 600 వికెట్లు తీసిన రెండో విండీస్ బౌలర్‌గా రికార్డులకెక్కాడు. ఇంటర్నేషనల్ లీగ్ 20 (ఐఎల్ టీ20)లో భాగంగా అబుదాబి నైట్ రైడర్స్‌కు ఆడుతున్న ఈ మిస్టరీ స్పిన్నర్.. షార్జా వారియర్స్‌తో మ్యాచ్ సందర్భంగా ఈ ఘనతను అందుకున్నాడు. టీ20 ఫార్మాట్‌లో అత్యధిక వికెట్లు తీసినవారిలో అఫ్ఘాన్ స్పిన్నర్ రషీద్ ఖాన్ 681 వికెట్లతో అగ్రస్థానంలో ఉండగా డ్వేన్ బ్రావో (631) రెండో స్థానంలో ఉన్నాడు. నరైన్ మూడో స్థానానికి చేరాడు.

జింఖానాలో పాండ్యా అభిమానుల హడావుడి

- స్మాట్ మ్యాచ్‌ల తరలింపు

భారత ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా కమ్ బ్యాక్ అదిరింది. రెండు నెలల విరామం తర్వాత బ్యాట్ పట్టిన పాండ్యా.. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ తొలి మ్యాచ్‌లోనే అర్ధ శతకంతో రఫ్ఫాడించాడు. జింఖాన స్టేడియంలో మంగళవారం పంజాబ్‌తో జరిగిన మ్యాచ్‌లో దంచేసిన పాండ్యాను చూసేందుకు అభిమానులు పోటీపడ్డారు. ఒకరిద్దరైతే పిచ్ మీదకే వచ్చేసి సెల్ఫీలు దిగి నానా హంగామా చేశారు. దాంతో తదుపరి మ్యాచ్‌లో ఫ్యాన్స్‌కు చెక్ పెడుతూ స్మాట్ నిర్వాహకులు కీలక నిర్ణయం తీసుకున్నారు. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీకోసం హైదరాబాద్ వచ్చిన టీమిండియా స్టార్ హార్దిక్ పాండ్యాను చూసేందుకు ఫ్యాన్స్ పోటెత్తారు. డిసెంబర్ 2 మంగళవారం జింఖానా మైదానంలో పంజాబ్, బరోడా తలపడిన మ్యాచ్‌లో.. పాండ్యా బ్యాటింగ్ చేస్తుండగా ఒక అభిమాని మైదానంలోకి దూసుకొచ్చి కాళ్లపై పడ్డాడు. 'ప్లీజ్ ఒక్క సెల్ఫీ' అని జేబులోంచి ఫోన్ తీసి అతడిని సిబ్బంది ఒకరు లాక్కెళ్లడానికి ప్రయత్నించగా పాండ్యా వారించాడు. ఆ అభిమానితో సెల్ఫీ దిగి పక్కను జరగగానే.. సదరు కుర్రాడినిని సిబ్బంది బయటకు లాక్కెళ్లారు. కాసేపటికే పాండ్యాను చూసేందుకు మరొక కుర్రాడు సైతం క్రీజు వద్దకు వచ్చేయగా సిబ్బంది పరుగున వచ్చి తీసుకెళ్లారు. ఈ రెండు ఘటనలతో ఆటకు అంతరాయం ఏర్పడింది. దాంతో.. ఆటగాళ్ల భద్రత, అంతరాయాలు లేకుండా మ్యాచ్ జరగాలనే ఉద్దేశంతో నిర్వాహకులు వేదికను మార్చారు. జింఖాన బదులు ఉప్పల్ స్టేడియంలో బరోడా తదుపరి మ్యాచ్ ఆడించేందుకు సిద్ధమయ్యారు.

రెండో పాట రెడీ

డిసెంబర్ 8న రిలీజ్, 6న ప్రోమో

మెగాస్టార్ చిరంజీవి 'మన శంకర వర ప్రసాద్ గారు'లో నయనతార కథానాయికగా నటించింది. అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమా సంగీత ప్రయాణం ఫస్ట్ సింగిల్ మీసాల పిల్లతో ప్రారంభమైంది. ఇది 75 మిలియన్ల+ వ్యూస్‌ను సాధించింది. ఫస్ట్ సింగిల్ చార్ట్ బస్టర్ హిట్ తర్వాత, మేకర్స్ ఇప్పుడు సెకండ్ సింగిల్ అప్‌డేట్‌తో వచ్చారు. సెకండ్ సింగిల్ టైటిల్ శశిరేఖ. పోస్టర్ సూచించినట్లుగా, ఫుట్ ట్యాపింగ్ బీట్‌లతో నిండిన మరో మెలోడియస్ ట్రాక్ అవుతుందని హామీ ఇస్తుంది. చిరంజీవి అద్భుతమైన ఎనర్జితో డ్యాన్స్ చేస్తూ అద్భుతమైన వైబ్‌ను జోడించింది. అందమైన పోర్ట్ నేపథ్యంలో ఆకట్టుకునే కెమిస్ట్రీ విజువల్‌గా గొప్ప కొరియోగ్రఫీని సూచిస్తోంది. భీమ్స్ సిసిరోలియో సంగీతం సమకూర్చిన ఈ పాట ప్రోమో డిసెంబర్ 6న విడుదల అవుతుంది. లిరికల్ వీడియో డిసెంబర్ 8న విడుదల అవుతుంది. ఈ చిత్రంలో కీలక పాత్ర పోషిస్తున్న విక్టరీ వెంకటేష్ తన షూటింగ్ పార్ట్ పూర్తి చేసుకున్నారు. ప్రొడక్షన్ పూర్తయ్యే దశకు చేరుకుంది. చిరంజీవి, వెంకటేష్ ఇద్దరూ కలిసి నటించిన మాస్ డ్యాన్స్ నంబర్ మరో మెయిన్ హైలైట్‌గా ఉండబోతోంది.

రామ్‌చరణ్, సుకుమార్.. మూవీ ఖరారు

టాలీవుడ్ స్టార్ హీరో రామ్ చరణ్, జీనియస్ డైరెక్టర్ సుకుమార్ కాంబినేషన్‌లో మరో మూవీ రూపొందనున్న విషయం తెలిసిందే. ఇప్పటికే వారిద్దరూ కలిసి కొంతకాలం క్రితం వర్క్ చేసిన రంగస్థలం.. బాక్సాఫీస్ వద్ద భారీ హిట్ గా నిలిచింది. చరణ్ క్రేజ్ ను విపరీతంగా పెంచింది. సుకుమార్ కు కూడా మంచి పేరును తీసుకొచ్చింది. దీంతో ఇప్పుడు రామ్ చరణ్, సుకుమార్ మరో సినిమా చేయనుండడంతో అంతా అప్పుడే భారీ అంచనాలు పెట్టుకున్నారు. ఎలాంటి జోనర్ లో తీస్తారోనని మాట్లాడుకుంటున్నారు. పుష్ప 2 తర్వాత చేయనున్న మూవీ కావడంతో.. సుకుమార్ భారీ ఎత్తున సినిమాను రూపొందించనున్నారని సినీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. ప్రస్తుతం సుకుమార్.. చరణ్ మూవీ స్క్రిప్ట్ ను పూరి చేసే పనిలో ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే చివరి దశకు చేరుకుందని తెలుస్తుండగా.. రీసెంట్ గా దుబాయ్ లో సుకుమార్, రామ్ చరణ్ కలిసినట్లు సమాచారం. దుబాయ్ లో ఇద్దరూ మీట్ అయినట్లు టాక్ వినిపిస్తోంది. సినిమా స్క్రిప్ట్ పై కాస్త క్లియర్ గా చర్చించుకున్నారని వినికిడి.

నిజానికి.. కొన్ని రోజుల క్రితమే సుకుమార్ అండ్ టీమ్ దుబాయ్ కు వెళ్లిందట. అక్కడ స్క్రిప్ట్ ను పూర్తి చేయడంలో బిజీగా ఉండగా.. రామ్ చరణ్ ఇటీవల వెళ్లి కలిసినట్లు తెలుస్తోంది. అయితే చర్చలు పూర్తి చేసుకుని హైదరాబాద్ కూడా ఆయన వచ్చేశారని సమాచారం. దీంతో మరికొద్ది రోజుల్లో స్క్రిప్ట్ వర్క్ మొత్తం పూర్తవ్వనుందని టాక్. అయితే చరణ్, సుకుమార్ సినిమాను మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ పై నవీన్ ఎర్నేని, రవిశంకర్ యలమంచిలి భారీ బడ్జెట్ తో నిర్మించనున్నారు. సుకుమార్ రైటింగ్స్ బ్యానర్ పై సుకుమార్ కూడా సినిమా నిర్మాణంలో భాగస్వామిగా ఉండనున్నారు. హీరోయిన్‌గా బాలీవుడ్ బ్యూటీ కృతి సనన్ ను సంప్రదించినట్లు ఇప్పటికే వార్తలు వచ్చాయి. 2026లో సినిమా షూటింగ్ మొదలు కానుందని ఇప్పటికే క్లారిటీ వచ్చేసింది. ఎందుకంటే ప్రస్తుతం రామ్ చరణ్.. పెద్ది మూవీతో బిజీగా ఉన్నారు. బుచ్చిబాబు సనా దర్శకత్వం వహిస్తున్న ఆ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. వచ్చే ఏడాది మార్చిలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఆ మూవీ పనులు అన్నీ కంప్లీట్ అయ్యాక.. చరణ్ సుకుమార్ మూవీ సెట్స్ లోకి అడుగు పెట్టనున్నారు. మరి చిత్రీకరణ ఎప్పుడు మొదలవుతుందో వేచి చూడాలి.

తిరువీర్, ఐశ్వర్య రాజేష్

ఓ సుకుమారి

యంగ్ హీరో తిరువీర్, ట్యాలెంటెడ్ హీరోయిన్ ఐశ్వర్య రాజేష్ తమ తమ చిత్రాలు 'ప్రీ వెడ్డింగ్ షో', 'సంక్రాంతికి వస్తున్నాం'తో బ్లాక్‌బస్టర్ విజయాలు అందుకున్నారు. ఇప్పుడు ఈ ఇద్దరూ కలిసి ఓ హోల్సమ్ ఫ్యామిలీ ఎంటర్టైనర్ చేస్తున్నారు. నూతన దర్శకుడు భరత్ దర్శన్ దర్శకత్వంలో గంగా ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ పై మహేశ్వర రెడ్డి మూలి నిర్మిస్తున్నారు. విమర్శకుల ప్రశంసలు పొందిన తొలి సినిమా 'శివం భజే' తర్వాత ఈ బ్యానర్ లో రూపొందుతన్న చిత్రమిది. ఈరోజు మేకర్స్ ఈ చిత్రం టైటిల్ 'ఓ.! సుకుమారి'ని రివిల్ చేశారు. ఆకట్టుకునే పోస్టర్‌ను మేకర్స్ ఆవిష్కరించారు. ఇందులో నీలిరంగు హృదయ చిహ్నాన్ని ఒక అద్భుతమైన నారింజ రంగు మెరుపుతో డివైడ్ చేశారు. గ్రామ ప్రజలు పరిగెడుతూ కనిపంచడం కథలోని ఊహించని మలుపులను సూచిస్తుంది.

'లైఫ్' మొదటి షెడ్యూల్ పూర్తి

కుంభమేళా ఫేమ్ మోనాలిసా కథానాయికగా నటిస్తున్న చిత్రం లైఫ్. సాయిచరణ్ హీరోగా వెంగమాంబ క్రియేషనర్స్ బేనర్ పై రూపొందుతున్న ఈ సినిమాకి శ్రీను కోటపాటి దర్శకత్వం వహిస్తున్నారు. అంజన్న నిర్మిస్తున్నారు . ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. తాజాగా ఈ చిత్రం మొదటి షెడ్యూల్ పూర్తి చేసుకుంది. త్వరలోనే రెండో షెడ్యూల్ ప్రారంభించనున్నారు మేకర్స్. ఈ చిత్రంలో సయాజీ షిండే, సీనియర్ నటుడు సురేష్, ఆమని, తులసి, రచ్చ రవి కీలక పాత్రలు పోషిస్తున్నారు.

'బ్యాడ్ బాయ్ కార్తీక్' ఎమోషనల్ సాంగ్ రిలీజ్

హీరో నాగ శౌర్య యాక్షన్ ఎంటర్టైనర్ 'బ్యాడ్ బాయ్ కార్తీక్' తో అలరించబోతున్నారు. నూతన దర్శకుడు రామ్ దేశినా (రమేష్) దర్శకత్వం వహించారు. శ్రీ వైష్ణవి ఫిల్మ్స్ బ్యానర్ పై శ్రీనివాస రావు చింతలపూడి నిర్మించారు. ఇప్పటివరకు విడుదలైన పాటలు సూపర్ హిట్ అయ్యాయి, టీజర్ కూడా అద్భుతమైన స్పందన అందుకుంది. గురువారం సినిమాలోని 'పొమ్మంటే...' అనే ఎమోషనల్ పాటను విడుదల చేశారు. హారిస్ జయరాజ్ స్వరపరిచిన పొమ్మంటే, మెలోడీ, ఎమోషన్ ఆకట్టుకుంది. విడిపోవడం వల్ల కలిగే బాధను, తోబుట్టువుల అనుబంధాన్ని అందంగా ప్రజెంట్ చేసింది. రచయిత చంద్రబోస్ మనసుకి హత్తుకునే సాహిత్యం రాశారు, గాయకులు విజయ్ యేసుదాస్, శక్తిశ్రీ గోపాలన్ తమ వోకల్స్ తో మరింత హార్ట్ టచ్చింగ్ గా మలిచారు. ఈ పాట చాలా కాలం పాటు నిలిచిపోతుంది. విజువల్ గా ఈ పాటలో నాగ శౌర్య, శ్రీదేవి విజయ్ కుమార్ మిస్ అండర్ స్టాండింగ్ ద్వారా విడిపోయిన బ్రదర్, సిస్టర్స్ గా కనిపించారు. వారి అద్భుతమైన పెర్ఫామెన్స్, అజయ్ ప్రజెన్స్ ట్రాక్ ఎమోషన్ ని మరింత పెంచింది. ఇది తోబుట్టువుల ప్రేమకు మనసుని కదిలించే సాంగ్. రసూల్ ఎల్లోర్ ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీని అందిస్తున్నారు, ఎడిటింగ్ కోటగిరి వెంకటేశ్వర రావు, ఆర్ట్ డైరెక్షన్ రామాంజనేయులు నిర్వహిస్తున్నారు.

Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana - 500013.
Published at h.no. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana - 500008. Editor: FAZUL RAHAMAN MOHAMMED. 040-4390 2732, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200